ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

రిపోర్టర్లు కావలెను
అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.
ఉదయం
సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 3 | సంచిక: 323 | పేజీలు: 6 | వెల: రూ.3/- | మంగళవారం 3 మార్చి 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

# యుద్ధం తీవ్రరూపం

## అమెరికా స్థావరాలే లక్ష్యంగా ఇరాన్ ప్రతీకార దాడులు



గల్ఫ్‌లోని చమురు శుద్ధి కేంద్రాలను లక్ష్యంగా చేసుకున్న ఇరాన్

సౌదీలోని అతి పెద్ద కేంద్రంపై దాడి - తాత్కాలికంగా మూసివేత

ఎల్ఎన్‌జీ ఉత్పత్తిని నిలిపేసిన ఖతార్ ఎనర్జీ .. నెతన్యాహు ఇంటిపై దాడి చేశాం: ఇరాన్

తప్పుడు వార్తలు: ఇజ్రాయెల్ ... గాయపడిన ఖమేనీ సతీమణి మృతి

యుద్ధంలోకి మిలిటెంట్ గ్రూపులు.. చమురు నౌకపై దాడిలో భారతీయుడి మృతి

ఇరాన్‌పై బాంబుల వర్షం కురిపిస్తున్న అమెరికా, ఇజ్రాయెల్

నతాంజ్ అణు కేంద్రంపై దాడి!.. భగ్గుమన్న చమురు ధరలు

**న్యూఢిల్లీ, మార్చి 2 (ప్రభాత ఉదయం)**

అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్‌ల మధ్య యుద్ధం తీవ్రరూపం దాలుస్తోంది. మరిన్ని ప్రాంతాలకు విస్తరిస్తోంది. సోమవారం అనేక ప్రాంతాల్లో దాడులు కొనసాగాయి. ఇరాన్‌కు మద్దతుగా మిలిటెంట్ గ్రూపులూ రంగంలోకి దిగడంతో ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. ఇరాన్ ఆయుధాగారాలను అమెరికా-ఇజ్రాయెల్ లక్ష్యంగా చేసుకుంటుండగా.. గల్ఫ్ దేశాల్లోని చమురు శుద్ధి కేంద్రాలపై ఇరాన్ దాడులకు దిగుతోంది. హర్మూజ్ జల సంధిలో చమురు నౌకలపైనా ఇరాన్ దాడులకు దిగుతోంది. ఈ మార్గం మీదుగానే ప్రపంచానికి 20శాతం చమురు రవాణా అవుతోంది. ఈ దాడులవల్ల ఆర్థిక వ్యవస్థలపై తీవ్ర ప్రభావం ..మిగతా 2లో



## గల్ఫ్ దేశాల అధినేతలకు
# మోదీ ఫోన్

### ఇరాన్ దాడిని ఖండించిన ప్రధాని

సౌదీ అరేబియా యువరాజుతో ఫోన్లో మాట్లాడిన మోదీ

బహ్రెయిన్ రాజు ఖలీఫాతో భారతీయుల భద్రతపై చర్చించిన ప్రధాని

సౌదీ, బహ్రెయిన్‌లపై ఇరాన్ దాడిని ఖండించిన నరేంద్ర మోదీ

**న్యూఢిల్లీ, మార్చి 2 (ప్రభాత ఉదయం)**

అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తల నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గల్ఫ్ దేశాల అధినేతలతో అక్కడి భారతీయుల భద్రతపై చర్చలు జరిపారు. అదే సమయంలో గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడులను మోదీ ఖండించారు. ఆయా దేశాధినేతలకు ఫోన్ చేసి వివరాలు కనుక్కున్నారు.

సౌదీ అరేబియా యువరాజు మహ్మద్ సల్మాన్‌తో ప్రధాని మోదీ ఫోన్లో మాట్లాడారు. బహ్రెయిన్ రాజు హమద్ బిన్ ఇసా అల్ ఖలీఫాతో కూడా మాట్లాడారు. ఆ దేశాల్లోని భారతీయుల భద్రతపై వారితో చర్చించారు. సౌదీ అరేబియా, బహ్రెయిన్‌ల నాయకులతో చర్చల సందర్భంగా ఆ దేశాలపై ఇరాన్ దాడులను మోదీ ఖండించారు.

అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు ప్రారంభమైనప్పటి నుంచి గల్ఫ్ దేశాల నాయకులతో ప్రధాని మోదీ నిత్యం సంప్రదింపులు జరుపుతున్నారు.

ఆదివారం ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూతో ఫోన్‌లో మాట్లాడారు. యూఏఈ ..మిగతా 2లో



## అన్నారం బ్యారేజీని కూల్చేందుకు కుట్రలా? కేటీఆర్

**హైదరాబాద్ మార్చి 2, (ప్రభాత ఉదయం)**

మేడిగడ్డ బ్యారేజీపై కుట్రలు చేసింది చాలదన్నట్టు... అన్నారం బ్యారేజీని కూల్చేందుకు కుట్రలకు తెర తీశారా? అంటూ భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్... ప్రభుత్వంపై ఆరోపణలు చేశారు. 'ఎక్స్'లో ఆయన సోమవారం ఈ మేరకు పోస్ట్ చేశారు. "నిబంధనలకు పాతరేసి బ్యారేజీ కిందే భారీ ఎక్సవేటర్లతో ఇసుక తవ్వకాలు జరపడం దుర్మార్గమే కాదు.. అతిపెద్ద నేరం. బ్యారేజీ సమీపంలో ..మిగతా 2లో

# ఒక్కొక్కరు మరో పదిమంది లీడర్లను తయారు చేయాలి

ఇగోలు పక్కన పెట్టి పనిచేయండి

మార్షల్ ఆర్ట్స్ రూపంలో క్లాస్ చెప్పిన రాహుల్ గాంధీ

రాహుల్‌ను ప్రత్యేకంగా కలిసిన సీతక్క



**వికారాబాద్, మార్చి 2 (ప్రభాత ఉదయం)**

ఇగోల కంటే పార్టీ ముఖ్యమని స్పష్టం రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. పార్టీ కోసం పని చేయాలని పిలుపునిచ్చారు. డీసీసీ అధ్యక్షులు.. మరో పదిమందిని తయారు చేయాలని, పని చేస్తున్న వారిని గుర్తించాలని రాహుల్ గాంధీ వెల్లడించారు. ఇండియా ఎదుర్కొంటున్న సమస్యలపై ఏఐసీసీ అగ్రనేత వివరించారు. డీసీసీ అధ్యక్షుల శిక్షణా తరగతులు విజయవంతంగా ముగిశాయి. అనంతగిరి హరితా రిసార్ట్స్‌లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల డీసీసీ అధ్యక్షుల శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమంలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా.. మార్షల్ ఆర్ట్స్ ..మిగతా 2లో



# నేడు సంపూర్ణ చంద్రగ్రహణం

2లో..

ఆకాశంలో కనిపించనున్న బ్లడ్‌మూన్

# హైడ్రా పేరుతో పేదల ఇళ్లు కూల్చేస్తున్నారు

బాన్సువాడ ఘటన దురదృష్టకరం

హిందువులంతా ఐక్యంగా పోరాడాలి

ఖమ్మంలో పేదల ఇళ్లను కూల్చి రోడ్డున పడేశారు

కేంద్రమంత్రి బండి సంజయ్ విమర్శలు

**కామారెడ్డి, మార్చి 2 (ప్రభాత ఉదయం)**

హిందూ ధర్మ పరిరక్షణ కోసం అందరం కలిసి పోరాడాల్సిన సమయం వచ్చిందని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. ఇటీవల బాన్సువాడలో జరిగిన ఘటన దురదృష్టకరమని చెప్పారు. కామారెడ్డిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లను ప్రభుత్వం కూల్చేస్తోందని బండి సంజయ్ ఆరోపించారు. పెద్దలతో బేరసారాలు కుదుర్చుకుని వారి జోలికి వెళ్లడం లేదన్నారు. మూసీ ఒడ్డున గాంధీ విగ్రహం పేరిట, ఖమ్మంలోని భూదాన్ భూముల్లో పేదల ఇళ్ల కూల్చివేతలు చేపట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బఫర్ జోన్‌లో ఎన్ని ఇళ్లున్నాయి? ఎన్ని కూల్చారు? అనే దానిపై చర్చకు సిద్ధమా? అని బండి సంజయ్ ప్రశ్నించారు. ఏఐసీసీ అగ్రనేత, ..మిగతా 2లో





## రాహుల్‌ను ప్రధాని చేయడమే
# మన కర్తవ్యం

రాహుల్ ప్రధాని అయితేనే దేశానికి క్షేమం

అందుకోసం కలసికట్టుగా పనిచేద్దాం

డిసిసి అధ్యక్షుల శిక్షణ ముగింపులో సిఎం రేవంత్

**వికారాబాద్, మార్చి 2 (ప్రభాత ఉదయం)**

లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యమని తెలుగు రాష్ట్రాల డీసీసీ అధ్యక్షులకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. దేశం కోసం రాహుల్ ప్రధాని కావాలని ఆయన ఆకాంక్షించారు. ఇందుకోసం మనమంతా కలసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. మోడీ వల్ల దేశానికి తీరని నష్టం జరుగుతోందన్నారు. రాషహుల్ ప్రధాని అయితేనే దేశానికి క్షేమమని అన్నారు. వికారాబాద్ ..మిగతా 2లో

# యుద్ధం తీవ్రరూపం



**మొదటి పేజీ తరువాయి...**

పడే అవకాశముందని ఆందోళన వ్యక్తమవుతోంది. మరోవైపు సంధికి ఇప్పట్లో అవకాశాలు కనిపించడం లేదు. చర్చలకు సిద్ధమని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించినా ఇరాన్ ససేమిరా అంది. యుద్ధం కారణంగా ప్రపంచ వ్యాప్తంగా వేల మంది విమాన ప్రయాణికులు చిక్కుకుపోయారు. తాము ఇరాన్‌తోపాటు గల్ఫ్ దేశాలతో మాట్లాడుతున్నామని రష్యా వెల్లడించింది. చర్చలు జరుగుతుండగానే అమెరికా దాడులు చేయడం తమను అసంతృప్తికి గురిచేసిందని వ్యాఖ్యానించింది. యుద్ధంలో అమెరికాతో

కలిసి పని చేసేందుకు సిద్ధమని ఫ్రాన్స్, జర్మనీ ప్రకటించాయి. తమ సైన్యాన్ని పంపించబోమని బ్రిటన్ వెల్లడించింది.

ఇరాన్‌ను నిర్ణయాత్మకంగా దెబ్బ తీస్తామని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు తెలిపారు.

ఖమేనీపై దాడి జరిగిన సందర్భంగా గాయపడిన ఆయన భార్య మన్సూరీ ఖొజాస్తే బాఘెర్జాదే (79) మరణించారు. ఖమేనీని ఆమె 1964లో పెళ్లాడారు. వారికి ఆరుగురు పిల్లలున్నారు. ఆమె బయట ఎక్కువగా కనిపించేవారు కాదు. దాడిలో గాయపడినప్పటి నుంచి ఆమె కోమాలోనే ఉన్నారు.

**ఇజ్రాయెల్, గల్ఫ్ దేశాలే లక్ష్యం..**

ఇరాన్, ఆ దేశానికి మద్దతిస్తున్న మిలిటెంట్ గ్రూపులు.. ఇజ్రాయెల్, అరబ్ దేశాలపై సోమవారం దాడులు చేశాయి. కువైట్‌లోని అమెరికా ఎంబసీపై దాడి జరిగింది. దీంతో ఆ ప్రాంతంలో మంటలు చెలరేగాయి. ముందుగానే ఎంబసీని ఖాళీ చేయించడంతో ప్రాణ నష్టం జరగలేదని తెలిసింది.

సౌదీ అరేబియాలోని దమ్మామ్‌లో ఉన్న ప్రపంచంలోనే అతి పెద్ద వాటిలో ఒకటైన రస్ తనూరా చమురు శుద్ధి కేంద్రంపై డ్రోన్లతో ఇరాన్ దాడి చేసింది. అయితే వాటిని అడ్డుకున్నామని సౌదీ రక్షణశాఖ వెల్లడించింది. కానీ ఆ ప్రాంతంలో నల్లని పొగ అలముకున్న వీడియోలు బయటకు వచ్చాయి. ప్రస్తుతానికి ఆ కేంద్రాన్ని తాత్కాలికంగా మూసి వేశారు. రస్ తనూరాలో రోజుకు 5 లక్షల బ్యారెళ్ల ముడి చమురును శుద్ధి చేస్తారు. ప్రపంచానికి దాదాపు 7శాతం చమురును ఈ కేంద్రం సరఫరా చేస్తుంది.

గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లో మార్షల్ ఐలాండ్స్‌కు చెందిన చమురు రవాణా నౌక ఎంకేడీ వ్యోమ్‌ను బాంబుతో వచ్చిన డ్రోన్ బోట్‌తో ఇరాన్ పేల్చేసింది. ఈ ఘటనలో ఒకరు మరణించారు. చనిపోయిన వ్యక్తి భారతీయుడని ఒమన్ వెల్లడించింది. నౌకలోని మిగతా 21 మంది సిబ్బందిని రక్షించి మరో ఓడలోకి తరలించారు. వీరిలో 16 మంది భారతీయులు, నలుగురు బంగ్లాదేశీయులు, ఒక ఉక్రెయిన్ జాతీయుడున్నారు.

కువైట్‌లోని అహ్మదీ చమురు శుద్ధి కేంద్రం వైపునకు దూసుకొచ్చిన రెండు డ్రోన్లను సైన్యం కూల్చేసింది. అయితే ఆ శిథిలాలు పడి ఇద్దరు కార్మికులకు గాయాలయ్యాయి. తమ దేశంలోని పౌర కేంద్రాలనూ ఇరాన్ లక్ష్యంగా చేసుకుంటోందని కువైట్ ఆరోపించింది.

ఖతార్‌లోని మెసయీద్, రస్ లఫాన్‌లలోని విద్యుత్తు కేంద్రాలపై ఇరాన్ డ్రోన్ దాడులు చేసింది. మెసయీద్‌లో నీటి ట్యాంకు ధ్వంసమైంది. యుద్ధం కారణంగా తాము ద్రవీకృత సహజ వాయువు (ఎల్ఎన్‌జీ) ఉత్పత్తిని నిలిపేస్తున్నామని ఖతార్ ఎనర్జీ ప్రకటించింది. ఇది ప్రపంచం మొత్తానికి ఎల్ఎన్‌జీని సరఫరా చేస్తుంది. దీంతో ఐరోపాలో ఎల్ఎన్‌జీ ధరలు 50% పెరిగాయి. రెండు ఇరాన్ యుద్ధ విమానాలను కూల్చేశామని ఖతార్ ప్రకటించింది.

అమెరికా యుద్ధ విమానాన్ని లక్ష్యంగా చేసుకుని దాడులు చేశామని ఇరాన్ ప్రకటించింది. వివరాలను వెల్లడించలేదు. దీనిపై అమెరికా సైన్యమూ స్పందించలేదు.

తమపై ఇరాన్ ప్రయోగించిన డ్రోన్లు, క్షిపణులను అడ్డుకున్నామని యూఏఈ ప్రకటించింది. అబుధాబీపై ప్రయోగించిన వాటిలో కొన్ని పేలాయని, మరికొన్ని చోట్ల శిథిలాలు పడి మరణాలు సంభవించాయని వెల్లడించింది. దుబాయ్‌లోనూ పేలుడు శబ్దాలు వినిపించాయి.

ఇరాక్ రాజధాని బాగ్దాద్‌లోని విమానాశ్రయంలో అమెరికా బలగాలపై సోమవారం దాడులు చేశామని ఇరాన్ అనుకూల మిలిటెంట్ గ్రూపు షియాటీ మిలీషియా సరయా ఆలియా అల్-దామ్ వెల్లడించింది. ఇర్బిల్‌లోని అమెరికా స్థావరంపై ఆదివారం దాడులు చేశామని తెలిపింది. సైప్రస్‌లోని బ్రిటన్ స్థావరంపైనా దాడులు చేశామని వివరించింది. డ్రోన్ దాడి కారణంగా బ్రిటన్ వైమానిక స్థావరం స్వల్పంగా దెబ్బతిందని సైప్రస్ తెలిపింది.

లెబనాన్ నుంచి ఇజ్రాయెల్‌పైకి క్షిపణులను ప్రయోగించామని హెజ్‌బొల్లా వెల్లడించింది. వీటిలో ఒక ప్రొజెక్టైల్‌ను అడ్డుకున్నామని, మిగిలినవి ఖాళీ ప్రదేశాల్లో పడ్డాయని ఇజ్రాయెల్ తెలిపింది. ప్రతిగా తాము జరిపిన దాడుల్లో 31 మంది మరణించారని, 149 మంది గాయపడ్డారని వివరించింది. బీరుట్‌లో పేలుళ్ల శబ్దాలు వినిపించాయని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

యుద్ధం మొదలైనప్పటి నుంచి తమ సైనికులు నలుగురు మరణించారని అమెరికా వెల్లడించింది.

ఇజ్రాయెల్ ప్రధాని ఇల్లు/కార్యాలయం, ఎయిర్‌ఫోర్స్ కమాండర్ ప్రధాన కార్యాలయంపై దాడులు చేశామని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ ప్రకటించింది. ఈ వార్తలను ఇజ్రాయెల్ ప్రభుత్వ వర్గాలు ఖండించాయి.

**ఇరాన్‌లో 555 మంది మృతి**

అమెరికా-ఇజ్రాయెల్ దాడుల కారణంగా ఇరాన్‌లో 555 మంది మరణించారు. ఇరాన్‌లో మరణించిన వారిలో చైనా జాతీయుడు ఒకరు ఉన్నారు. ఇరాన్‌లోని 130 నగరాలపై దాడులు జరిగాయి. సోమవారం మధ్యాహ్నం ఇరాన్ రాజధాని టెహ్రాన్‌పై యుద్ధ విమానాలు విరుచుకుపడ్డాయి.

ఇరాన్‌లోని నతాంజ్ అణు కేంద్రంపై ఆదివారం అమెరికా-ఇజ్రాయెల్ దాడులు చేశాయని అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ ఇరాన్ రాయబారి రెజా నజాఫీ తెలిపారు.

బీరుట్‌పై జరిపిన దాడిలో హెజ్‌బొల్లా నిఘా విభాగం అధిపతిగా పని చేస్తున్న కమాండర్ హుసేన్ మాక్లెడ్ మరణించాడు. దక్షిణ లెబనాన్, బీరుట్‌లలో ప్రజలు పాఠశాలల్లో తలదాచుకుంటున్నారు.

## అన్నారం బ్యారేజీని కూల్చేందుకు కుట్రలా? కేటీఆర్

**మొదటి పేజీ తరువాయి...**

తవ్వకాలు చేపట్టకూడదన్న నిబంధనలను అతిక్రమించిన ఇసుక మాఫియాపై వెంటనే క్రిమినల్ చర్యలు తీసుకోవాలి. బ్యారేజీని బలహీనపరిచి భారాసపై బురదజల్లే పన్నాగాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలి. తెలంగాణ వరప్రదాయిని కాళేశ్వరం ప్రాజెక్టును దెబ్బతీసేందుకు... నాటి నుంచి నేటి వరకు కాంగ్రెస్ పార్టీ చేస్తున్న కుట్రలను క్షమించే ప్రసక్తే లేదు. రేవంత్ సర్కారు... నిబంధనలు తుంగలో తొక్కి, అన్నారం బ్యారేజీని ప్రమాదంలోకి నెడుతోంది. ఇది కచ్చితంగా కాళేశ్వరం ప్రాజెక్టును దెబ్బతీసే పన్నాగమే. అందులో భాగంగానే పట్టపగలే అన్నారం బ్యారేజీ నుంచి కాంగ్రెస్ నాయకుల మాఫియా ఇసుకను తోడేస్తోంది. తెలంగాణ వనరులను ఆ పార్టీ ఎలా కొల్లగొడుతుందో చెప్పడానికి ప్రత్యక్ష ఉదాహరణ ఇది. కాళేశ్వరం బ్యారేజీలకు ఏమైనా జరిగితే పూర్తి బాధ్యత కాంగ్రెస్‌దే. ఆ పార్టీకి ప్రజలు గుణపాఠం చెప్పే రోజు దగ్గర్లోనే ఉంది" అని కేటీఆర్ పేర్కొన్నారు. సూర్యాపేట జిల్లాలో మైనింగ్ ఈ-వేలంలో భారీ అక్రమాలు చోటు చేసుకున్నాయని, ఆ టెండర్లను వెంటనే రద్దు చేయాలని భారాస రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ డిమాండ్ చేశారు. సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆయన లేఖ రాశారు. "జిల్లాలో సుమారు 1,100 ఎకరాల రిజర్వు ఫారెస్టు ఉంది. దీనికి సంబంధించి మైనింగ్ టెండర్ పత్రాల్లో చట్టబద్ధంగా వివరాలను పొందుపర్చలేదు. ప్రధానంగా మినరల్ బ్లాక్‌ల అక్షాంశాలు, రేఖాంశాల కో-ఆర్డినేట్లు, అటవీ కంపార్ట్‌మెంట్ వివరాలు, డీజీపీఎస్ సర్వే ధ్రువీకరణ వివరాలు, జియోలాజికల్ నివేదికలు లేకుండానే వేలం జరిగింది. అటవీ శాఖ నుంచి ఎన్‌వోసీ లేకుండానే వేలం నిర్వహించినట్లు ఆరోపణలు ఉన్నాయి. అటవీ ప్రాంతాల్లో నిబంధనలు పాటించకుండా మైనింగ్ చేపడితే పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుంది. మైనింగ్ నిబంధనలు-2015ను, హైకోర్టు సూచనలు పట్టించుకోలేదు. మైనింగ్ అక్రమాలు, కేసులు ఎదుర్కొంటున్న డెక్కన్ సిమెంట్స్, ఎన్‌సీఎల్ పరిశ్రమలకు బ్లాక్‌ల కేటాయింపులపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అన్ని అనుమతుల తర్వాతే మళ్లీ వేలం నిర్వహించాలి. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ఈ విషయంలో వెంటనే జోక్యం చేసుకోవాలి" అని కేటీఆర్ పేర్కొన్నారు. సీఎంకు రాసిన లేఖ ప్రతులను ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సీఎస్‌కు పంపించారు.

## హైడ్రా పేరుతో పేదల ఇళ్లు కూల్చేస్తున్నారు

**మొదటి పేజీ తరువాయి...**

లోక్సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ హైదరాబాద్ పర్యటనపై బండి సంజయ్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఆయన పర్యటన పాకెట్ మనీ కోసమేనా అని ప్రశ్నించారు. గాంధీ కుటుంబానికి కాంగ్రెస్ రూ.10 వేలకోట్లు ఇవ్వ గలదని సీఎం రేవంత్ రెడ్డే చెప్పారన్నారు. ఒక్క తెలంగాణ నుంచే వెయ్యి కోట్లు గాంధీ కుంబానికి వెళ్తాయని ఆరోపించారు. కామారెడ్డి బాన్సువాడలో జరిగిన కలహాలలో జైలుకి పోయిన బాధితుల కుటుంబ సభ్యులను బండి సంజయ్ పరామర్శించారు. ముఖ్యమంత్రి బలిసినోడిని వదిలి పెట్టి నిరుపేదల జోలికి పోతున్నారు. రాహుల్ గాంధీ చేస్తున్నది రాజకీయ పర్యటనా? లేక కలెక్షన్ల సమీక్షనా? అని రాష్ట్రం చూస్తుందని అన్నారు. హైదరాబాద్ లో ఫాతిమా కళాశాలను వదిలి పెట్టి ఖమ్మంలో కళాశాలలను కూల్చిన గొప్పతనం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిది. రాష్ట్ర ముఖ్యమంత్రి పేదల జోలికి వస్తే అదే బోల్డోజర్లు తీసుకుని నీపైకి వస్తాం. గడిచిన ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయక పోయినా కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి మనం తీసుకున్న తప్పుడు నిర్ణయం వల్లనే మనం ఈ గోస పడుతున్నాం. వచ్చే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో మనం ఆలోచించి ఓటు వేయాలి. కామారెడ్డిలో జరుగుతున్న అన్యాయాలపై ప్రశ్నిస్తే ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణా రెడ్డిపై దాడి చేశారు.

## ఒక్కొక్కరు మరో పదిమంది లీడర్లను తయారు చేయాలి

**మొదటి పేజీ తరువాయి...**

చేస్తూ డీసీసీ అధ్యక్షులకు క్లాస్ చెప్పారు రాహుల్. జియు జిట్సు అనే మార్షల్ ఆర్ట్‌లో మెళకువలను డీసీసీ అధ్యక్షులకు వివరించారు. మార్షల్ ఆర్ట్స్‌ను వ్యక్తిగత జీవితంలో అన్వయించుకోవాలని సూచించారు. కాంగ్రెస్ ఐడియాలజీపై క్లాస్ చెప్పారు. నాయకులు తమ అహంకారాన్ని పక్కన పెట్టి పని చేయాలని రాహుల్ సూచించారు. పాకిస్థాన్‌కు చైనా మద్దతు ఇస్తోందని.. ఇరాన్ వెనక చైనా, రష్యా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు మోదీ పూర్తిగా సరెండర్ అయ్యారని.. ట్రంప్‌కు వ్యతిరేకంగా మోదీ పని చేయలేరని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. డీసీసీ అధ్యక్షుల శిక్షణా తరగతులు ముగియడంతో వికారాబాద్ నుంచి హెలికాప్టర్‌లో శంషాబాద్ వెళ్ళారు. అక్కడి నుంచి ఏఐసీసీ అగ్రనేత ఢిల్లీకి బయలుదేరి వెళతారు. ఇదిలావుంటే లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ వికారాబాద్ పర్యటన సందర్భంగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క మర్యాదపూర్వకంగా కలిశారు. వికారాబాద్ జిల్లా అనంతగిరి కొండల్లోని హరిత రిసార్ట్స్‌లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ డీసీసీ అధ్యక్షుల 10 రోజుల శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమానికి రాహుల్ గాంధీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క ఆయనతో రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిస్థితులు,ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పార్టీ బలోపేతంపై చర్చించినట్లు తెలిసింది.

## నేడు సంపూర్ణ చంద్రగ్రహణం

### ఆకాశంలో కనిపించనున్న బ్లడ్‌మూన్

**హైదరాబాద్, మార్చి 02(ప్రభాత ఉదయం):**

మంగళవారం రాత్రి ఆకాశంలో అద్భుత ఘట్టం ఆవిష్కృతం కానుంది. సంపూర్ణ చంద్రగ్రహణంతో ఈ అవకాశం దక్కనుంది. ప్రపంచవ్యాప్తంగా 'బ్లడ్‌మూన్' కనువిందు చేయనుంది. మంగలశారం మధ్యాహ్నం 3.20 గంటల ప్రాంతంలో బ్లడ్‌మూన్ దశ ప్రారంభం కానుంది. అయితే, దీని ప్రభావం మాత్రం 4.34 గంటల నుంచి మొదలవ్వనుంది. ఇండియాలోని చాలా రాష్ట్రాల్లో బ్లడ్‌మూన్‌ను చూడాలంటే సూర్యాస్తమయం వరకు వేచి చూడాల్సిందే. ఇక, తెలుగు రాష్ట్రాల్లో కూడా సాయంత్రం 6 గంటల తర్వాతే బ్లడ్‌మూన్ ఉంటుంది. గ్రహణం ముగిసే చివరి ఘట్టాన్ని వీక్షించే అవకాశం కూడా తెలుగు రాష్ట్రాలకు ఉండనుంది. భూమి నీడ చంద్రునిపై పూర్తిగా పడినప్పుడు సంపూర్ణ చందగ్రహణం ఏర్పడుతుంది. భూ వాతావరణం సూర్యకాంతిని వక్రీకరించి, కేవలం ఎరుపు రంగు కిరణాలను మాత్రమే చంద్రునిపైకి ప్రసరింపజేస్తుంది. దీని వల్ల చంద్రుడు ఎరుపు రంగులో మెరుస్తూ కనిపిస్తాడు. చంద్రుడు ఎరుపు రంగులో కనిపిస్తాడు కాబట్టి.. దాన్ని 'బ్లడ్‌మూన్' అని పిలుస్తారు. చంద్రునిపై భూమి నీడ దాదాపు ఒక గంట రెండు నిమిషాల పాటు పడనుంది. అయితే, ఇండియాలోని ప్రజలు బ్లడ్‌మూన్‌ను కొంత సమయం పాటు మాత్రమే చూసే అవకాశం ఉంటుంది. దేశంలోని చాలా నగరాల్లో 7 నుంచి 25 నిమిషాల పాటు బ్లడ్‌మూన్‌ను వీక్షించే అవకాశం ఉంటుంది. దేశ రాజధాని ఢిల్లీ ప్రజలకు దాదాపు 20 నిమిషాలకుపైగా సమయం వరకు గ్రహణాన్ని వీక్షించనున్నారు. ఈ అద్భుత దృశ్యాన్ని వీక్షించడానికి భారతదేశంలోని తూర్పు, ఈశాన్య ప్రాంతాలు అత్యంత అనుకూలమైనవి. ఈ ప్రాంతాల్లో త్వరగా చంద్రోదయం అవుతుంది కాబట్టి గ్రహణం ఎక్కువ సేపు ఉంటుంది. ఇటానగర్,గువహటి, సిలిగురి, కోల్‌కతా వంటి నగరాల్లో గ్రహణం అత్యంత స్పష్టంగా, ఎక్కువ సమయం పాటు కనిపిస్తుందని ఖగోళ శాస్త్రవేత్తలు వెల్లడించారు.



పోగుట్టుకున్న వస్తువులను ఇస్తున్న క్రైమ్ పోలీస్ లు

## ఆటోలో పోగొట్టుకున్న వస్తువులను తిరిగి ఇస్తున్న జనగామ క్రైమ్ పోలీసులు

**జనగామ జిల్లా ప్రతినిధి, మార్చి 02 (ప్రభాత ఉదయం)**

జనగామ జిల్లా కేంద్రంలో గల పాల కేంద్రం వద్ద సోమవారం మధ్యాహ్నం 12:30 గంటల సమయాన చేర్యాల మండలం ముస్త్యాల గ్రామం బేడబుడుగ జంగాల సామజిక వర్గానికి చెందిన వానరాసి స్పందన భర్త పరుశ రాములు అనే మహిళా ఎలక్ట్రికల్ ఆటో ఎక్కి బతుకమ్మ కుంట దగ్గర దిగిందని, ఆటోలో 5వేల రూపాయల నగదు, 50 వేల రూపాయల విలువ చేసే ఒప్పో 27 ప్రోమో సెల్ ఫోన్, పావు లెత్తు బంగారు కమ్మలు గల హ్యాండ్ బ్యాగ్ మరిచిపోయింది. జనగామ చౌరస్తాలోని పోలీస్ కంట్రోల్ రూం వద్దకు వచ్చి ఏడ్చు కుంటూ క్రైమ్ పోలీసులకు విషయాన్ని చెప్పగా జనగామ సీఐ సత్య నారాయణ రెడ్డి ఆదేశాల మేరకూ క్రైమ్ పోలీసులు తక్షణమే స్పందించి లోకేషన్ ట్రేస్ చేసి, ఆటోను వెతికి పట్టుకొని, ఆ మహిళకు సెల్ ఫోన్, 5వేల రూపాయల నగదు, పావులెత్తు కమ్మలు గల హ్యాండ్ బ్యాగ్ అప్ప గించారు. సీఐ సత్య నారాయణ రెడ్డి, క్రైమ్ ఎస్ఐ భరత్, ఎస్ఐ రతీష్, క్రైమ్ కానిస్టేబుల్స్ కర్ణాకర్ , కృష్ణ, ఐటీ కోర్ ఏఏఓ సల్మాన్ లకు సదరు మహిళా కృతజ్ఞతలు తెలిపారు.



ప్రజావాణి లో అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్

## ప్రజావాణి అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**జనగామ జిల్లా ప్రతినిధి, మార్చి 02(ప్రభాత ఉదయం):**

జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో భాగంగా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్ షాలోమ్ లతో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అర్జీదారుల సమస్యల గురించి తెలుసుకుంటూ (86) అర్జీలను స్వీకరించారు.ఈ సందర్భంగా స్వీకరించిన పలు ఫిర్యాదుల వివరాలిలా ఉన్నాయి..జాఫర్గడ్ మండలం, తమ్మడపల్లి గ్రామానికి చెందిన లోకిని కిష్టయ్య, తనకు సర్వే నంబర్ 173 లో 7 గుంటలు, 324/బి లో 36 గుంటల భూమి కలదని, తన పేరున పట్టా పాస్ బుక్ జారీ చేయుట కొరకు దరఖాస్తు చేసుకున్నారు.కొడకండ్ల మండలం, రంగాపురం గ్రామానికి చెందిన నలమాస నర్సమ్మ, తన భర్త కల్లు గీత కార్మికుడిగా చేస్తూ అనారోగ్యంతో మరణించాడని, తాను ఒంటరి మహిళ అయినందున ఒంటరి మహిళ పింఛను ఇప్పించుటకు తగిన చర్యలు తీసుకోవాలని వేడుకుంటూ దరఖాస్తు చేసికున్నారు.తరిగొప్పుల మండలం, అబ్దుల్ నాగారం గ్రామానికి చెందిన బాషబోయిన ఉప్పమ్మ, తన ఇందిరమ్మ ఇంటికి కిచెన్ లో మెట్ల నిర్మాణం గురించి విన్నవిస్తూ అర్జీ చేశారు.జాఫర్గడ్ మండలం, రఘునాథపల్లె గ్రామానికి చెందిన ఎడ్ల స్వప్న, తనకు ఎకరం 27 గుంటల భూమి కలదని, ఆ భూమిని రికార్డులో తన పేరును నమోదు చేయించగలరని వినతిపత్రం సమర్పించారు.ఈ ప్రజావాణిలో ఆర్డీఓలు గోపీరాం, వెంకన్న, డీఆర్‌డీఓ వసంత, జిల్లా పౌరసరఫరాల అధికారిణి సరస్వతి, డీఏఓ అంబికా సోనీ, వివిధ శాఖల సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## గల్ఫ్ దేశాల అధినేతలకు మోదీ ఫోన్

**మొదటి పేజీ తరువాయి...**

అధ్యక్షుడు షేక్ మహ్మద్ బిన్ జాయెద్ ఆల్ నహ్యాన్‌తో కూడా మాట్లాడారు. భారతీయుల క్షేమం కోసం కృషి చేస్తున్నందుకు ఆల్ నహ్యాన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. గల్ఫ్ దేశాల్లోని పరిస్థితిని సమీక్షించడానికి ప్రధానమంత్రి భద్రతా కేబినెట్ కమిటీ నిన్న సమావేశమైంది.

## రాహుల్‌ను ప్రధాని చేయడమే మన కర్తవ్యం

**మొదటి పేజీ తరువాయి...**

వేదికగా తెలుగు రాష్ట్రాల డీసీసీ అధ్యక్షుల శిక్షణా ముగింపు సమావేశం సోమవారం జరిగింది.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీతోపాటు సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజా జీవితంలో తానెప్పుడూ పైరవీలు చేయలేదన్నారు. గతంలో ప్రజాసమస్యలపై గళం విప్పిన తనపై కేసులు నమోదు చేశారని గుర్తు చేసుకున్నారు. ఆదివారం సైతం తాను కోర్టుకు వెళ్లినట్లు చెప్పుకొచ్చారు. ఈ 19 ఏళ్లలో జడ్పీటీసీ నుంచి తాను సీఎం అయ్యానని గుర్తు చేసుకున్నారు. ఆ క్రమంలో పార్టీ పదవులు సైతం నిర్వహించానని చెప్పారు. ఎమ్మెల్యేగా తాను


# ఘనంగా తెలంగాణ ఉద్యమ నాయకుడు ఎర్రోళ్ల యాదయ్య జన్మదిన వేడుకలు



ఎర్రోళ్ల యాదయ్య చేత కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలియచేస్తున్న జర్నలిస్టులు, నాయకులు



తెలంగాణ ఉద్యమ నాయకుడు ఎర్రోళ్ల యాదయ్య కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన గౌతమ్, దుర్గేష్, నవీన్ తదితరులు



తెలంగాణ ఉద్యమ నాయకుడు ఎర్రోళ్ల యాదయ్య

### గగన్ పహాడ్ లో సంబరంగా యాదయ్య జన్మదిన వేడుక

### తండ్రి, మాజీ సర్పంచ్ దివంగత ఈ ఆర్ గోపాల్ ను గుర్తుచేసుకున్న బస్తీ ప్రజలు

**బుద్వేల్, మార్చి 2 (ప్రభాత ఉదయం)**

తెలంగాణ ఉద్యమ నాయకుడు, గగన్ పహాడ్ కు చెందిన ఎర్రోళ్ల యాదయ్య జన్మదిన వేడుకలు సోమవారం సాయంత్రం ఘనంగా జరిగాయి. బస్తీ ప్రజలు, స్నేహితులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, జర్నలిస్టులు ఎర్రోళ్ల యాదయ్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి కేక్ కట్ చేయించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఎర్రోళ్ల యాదయ్య చురుకైన పాత్ర పోషించారన్నారు. యాదయ్యకు భగవంతుడు ఆయురారోగ్యాలు ఇచ్చి మంచి భవిష్యత్తు నివ్వాలని ప్రార్థించారు.

**తండ్రి ఈఆర్ గోపాల్ గుర్తు చేసుకున్న బస్తీ ప్రజలు :**

ఎర్రోళ్ల యాదయ్య తండ్రి ఈ ఆర్ గోపాల్ గగన్ పహాడ్ గ్రామ సర్పంచ్ గా ప్రజలకు ఎన్నో సేవలు అందించారని ఆయన వారసునిగా ఎర్రోళ్ల యాదయ్య రాజకీయాల్లోకి రావడం సంతోషకరమని గగన్ పహాడ్ బస్తీ వాసులు గుర్తు చేసుకున్నారు. యాదయ్యకు రాజకీయాలలో దేవుడు మంచి భవిష్యత్తును కలగజేయాలని కోరారు.

**ఎర్రోళ్ల యాదయ్య కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన జర్నలిస్టులు:**

ఎర్రోళ్ల యాదయ్య కు రాజేంద్రనగర్ కు చెందిన జర్నలిస్టులు జన్మదిన శుభాకాంక్షలు తెలియచేశారు. కేక్ కట్ చేయించి శాలువాలతో సన్మానించారు. యాదయ్య చేత కేక్ కట్ చేయించిన వారిలో జర్నలిస్టులు మేకల దామోదర్ రెడ్డి, అప్పారెడ్డి గూడెం భీమయ్య, మెక్కొండ ప్రేమ్ రాజ్, బడిగె బాబురావు, వర్కాల చందు, కోరని మహేష్ లతో పాటు నాయకులు సరికొండ దుర్గేష్, వీర్లపల్లి నవీన్, ప్రొఫెసర్ కోరని రవీందర్, దేవదాస్, కట్టెల మండి గౌతం తదితరులు ఉన్నారు.



మెగా మహిళా రైతు మేళా బ్రోచర్ ను ఆవిష్కరిస్తున్న వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య తదితరులు

## మార్చి 8, 9 తేదీలలో రాజేంద్రనగర్‌లో మెగా మహిళా రైతు మేళా

**బుద్వేల్, మార్చి 2 (ప్రభాత ఉదయం):**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక లో బాగంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజేం ద్రనగర్ లో ఈ నెల 8, 9 తేదీలలో మెగా మహిళా రైతు మేళా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వ్యవసాయ వర్శిటీ ఉప కులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య తెలిపారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా మహిళా రైతు మేళా కు రాష్ట్ర వ్యవసాయ శాఖ, కోరమండల్ ఇంటర్నేషనల్ లు సహకారం అందజేస్తున్నాయన్నారు. మెగా మహిళా రైతు మేళా గురించి సోమవారం వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహాన్ సమీక్షా సమావేశం నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాక సంచాలకులు డాక్టర్ గోపి, ఉద్యానశాఖ సం చాలకులు డాక్టర్ యాస్మిన్ బాషా తదితరులు పాల్గొన్నారన్నారు. ఈ మేళా లో ఎనిమిది నుంచి పది వేల మహిళా రైతులు పాల్గొంటారన్నారు. సెర్ఫ్ కి చెందిన మూడు వేల మంది మహిళా రైతులు పాల్గొం టారన్నారు. ఈ మేళా కు ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి , వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు. గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ అనసూయ సీతక్క, ఐటీ శాఖ మంత్రి డి శ్రీధర్ బాబు, పార్లమెంటు సభ్యురాలు కడియం కావ్య, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ లు హజరౌతారన్నారు.



కాలి గాయంతో ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న గౌడ సంఘం తెలంగాణ రాష్ట్ర కోశాధికారి, బుద్వేల్ నివాసి పి.హరిచరణ్ గౌడ్ ను సోమవారం మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్ తో పాటు రంగారెడ్డి జిల్లా గౌడ సంఘం నాయకులు టి ప్రాందాస్ గౌడ్ లు కలసి పరమార్శించారు.

- బుద్వేల్, ప్రభాత ఉదయం

## పోలీస్ స్టేషన్ వరకు వెళ్లిన కాలనీ అసోసియేషన్ గొడవ

**రాజేంద్రనగర్, మార్చి 2 (ప్రభాత ఉదయం)**

కిస్మత్ పూర్ ఓం నగర్ లోని ఎస్ ఎం ఎన్ఎక్లేవ్ లో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ లో ఇరు గ్రూపుల మధ్య జరిగిన గొడవ పోలీసు కేసుల వరకు వెళ్లింది. కాలనీలో ఆదివారం రాత్రి జరిగిన గొడవ లో తనను గాయపరిచారంటు మంజునాథ్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సాయినాథ్, సుబ్రమణ్యం, ప్రవీణ్ అనే వ్యక్తులపై రాజేంద్రనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిపై కాలనీలోని కొందరు అభ్యంతరం వ్యక్తం చేస్తు పోలీసులు ఏక పక్షంగా వ్యహరిస్తున్నారని ఆరోపిస్తు రాజేంద్రనగర్ డీసీపీ కార్యాలయం వద్ద నినాదాలు చేశారు. దీనిపై రాజేంద్రనగర్ ఇన్స్పెక్టర్ ముత్తు యాదవ్ ను వివరణ కోరగా కాలనీ అసోసియేషన్ గొడవలు తమకు అవసరం లేదని, తనను కొట్టారని మంజునాథ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీసీ పుటేజీ ని పరిశీలించగా కొట్టినట్లు తేలిందని అం దుకే కేసు నమోదు చేశామన్నారు.

# సహజ రంగులతో హోళీ ఆడటం ఆరోగ్యానికి మంచిది









**రాజేంద్రనగర్, మార్చి 2 (ప్రభాత ఉదయం)**

హోళి పండుగను పురస్కరించుకుని రాజేంద్రనగర్ లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, కమ్యూనిటీ సైన్స్ కళాశాల, డి పార్ట్మెంట్ ఆఫ్ అపెరల్ అండ్ టెక్స్ టైల్స్, నేచురల్ డై ప్రాసెసింగ్ అండ్ ఇంక్యుబేటర్ సెంటర్ ఆధ్వర్యంలో సహజ రంగులను తయారు చేస్తు ప్రజలకు అందుబాటులో ఉంచుతున్నారు. తయారు చేసిన సహజ రంగులను రాజేంద్రనగర్ లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం నేచురల్ డై ప్రాసెసింగ్ అండ్ ఇంక్యుబేటర్ సెంటర్, సైఫాబాద్ లోని కమ్యూనిటీ సైన్స్ కళాశాల కేంద్రాలుగా విక్రయిస్తున్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య ప్రోత్సాహంతో సహజ రం గులను తయారు చేస్తున్నారు. వివిధ రకాల పూలతో తయారు చేసిన రంగులతో హోళీ ఆడటం మం చిదని సూచిస్తు అవగాహన కల్పిస్తున్నారు.




హోళీ పండుగ అంటేనే రంగుల పండుగ అని ఆ పండుగను సంతోషంగా, ఆనందంగా జరుపుకోవాలి కానీ హోళీ ఆడి అనారోగ్య సమస్యలు కొని తెచ్చుకోవద్దని సూచిను న్నారు. జాఫ్రా విత్తనాలు నూరి, మొక్క జొన్న పిండి కలిపి నీరు పోసి ముద్ద చేసి ఎండబెట్టిన తర్వాత నూరి జల్లడతో వడ గట్టిన తర్వాత అది నారింజ రంగు గా మారుతుందని సూచిస్తున్నారు. ఆ రంగు వాడితో ఎలాంటి ఇబ్బందులు ఉండవని చెబుతున్నారు. బంతిపూలు, మొక్కజొన్న పిండి తో పసుపు రం గు తయారు చేయడం, బాకపు చెట్టు కట్టెను నీటిలో మరిగించి రంగు నీరు వేరు చేసి మొక్కజొన్న పిండి కలిపితే గులాబీ రంగు వస్తుందని చెబుతున్నారు. మొదుగుపువ్వు పొడి, నీలిరంగు పొడి, మొక్క జొన్న పిండి కలిపి తే ఆకుపచ్చ రంగు వస్తుందని ఆ రంగు కూడా సహజరంగు అని గుర్తు చేస్తున్నారు. ఇలా పూలతో రంగులు చేసి ఆడుకుంటే ఎలాంటి అనారోగ్య సమస్యలు రావాని, ఇది పర్యావరణానికి కూడా ఎలాంటి హాని కలుగచేయదని సహజ రంగుల విభాగంలో పనిచేస్తున్న డాక్టర్ పూజ తెలిపారు.

## పశ్చిమ ఆసియా ప్రాంతంలో నెలకొన్న పరిస్థితుల రీత్యా గల్ఫ్ దేశాల్లో చిక్కుకున్న తెలంగాణ వాసులను తక్షణం సురక్షితంగా తీసుకురావాలి

### రాష్ట్ర ప్రభుత్వానికి సబితా ఇంద్రారెడ్డి విజ్ఞప్తి...

**బుద్వేల్, మార్చి 2 (ప్రభాత ఉదయం) :**



మధ్య పాశ్చ్య దేశాల్లో నెలకొన్న యుద్ధ వాతావరణం నేపథ్యంలో అక్కడ చిక్కుకున్న తెలంగాణ వాసులను సురక్షితంగా తీసుకు రావాలని మాజీ మంత్రివర్యులు, మహేశ్వరం నియోజకవర్గము శాసన సభ్యురాలు, శాసనసభాపక్ష బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పి. సబితా ఇంద్రారెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

తెలంగాణ ప్రాంతమునకు చెందిన వేలాది మంది గల్ఫ్ దేశాల్లో పని చేస్తున్నారని, ఇప్పుడు ఉద్రిక్త పరిస్థితుల్లో అక్కడ అనిశ్చితి నెలకొనడంతో పాటు, భద్రత కొరవడిందన్నారు. మరోవైపు పలు విమానాశ్రయాల్లో ఆంక్షలు, విమాన సర్వీసుల రద్దు వల్ల చాలా మంది ఎక్కడికక్కడ చిక్కుకుపోయి, అనేక ఇబ్బందులు పడుతున్నారని వెల్లడించారు.

అందువల్ల రాష్ట్రానికి చెందిన వారందరినీ సురక్షితంగా ఇక్కడికి తీసుకురావడంలో ప్రభుత్వం చొరవ చూపాలని, ఈ విషయంలో కేంద్రంతో సమన్వయం చేసుకుని, ప్రత్యేక ఏర్పాట్ల ద్వారా వారందరినీ తరలించాలని కోరారు. ఇంకా గల్ఫ్ దేశాల్లో ఉన్న భారత రాయబార కార్యాలయాలతో కూడా సమన్వయం చేసుకుని, తెలంగాణ వాసుల పరిరక్షణకు చర్య తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఇంకా అక్కడి వారి పరిస్థితిని ఎప్పుడికప్పుడు, వారి కుటుంబాలకు తెలియజేసే విధంగా ఇక్కడ ప్రత్యేక కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేసి, హెల్ప్‌లైన్ నెంబర్లు కూడా అందుబాటులోకి తేవాలని సూచించారు.

తెలంగాణ వాసుల భద్రత, వారి సురక్షిత ప్రయాణం రాష్ట్ర ప్రభుత్వ బాధ్యత అన్న సబితా ఇంద్రా రెడ్డి ఈ సంక్షోభ సమయంలో రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వం పని చేయాలని విజ్ఞప్తి చేశారు.

## సమాచార కాలం :

అత్తాపూర్ సర్కిల్ నూతనంగా ఏర్పాటైంది. ఈ సర్కిల్ పరిధిలోకి అత్తాపూర్, హైదర్ గూడ , సులేమాన్ నగర్ , శాస్త్రీపురం, కాటేదాన్, మైలార్దేవుపల్లి డివిజన్లు వస్తాయి. ఈ కార్యాలయం బుద్వేల్ లో ఉంది. ఇక్కడ పనిచేస్తున్న అధికారుల ఫోన్ నెంబర్లు ప్రజల సమాచారం కోసం ఇస్తున్నాం.....

వి. సమ్మయ్య - డిప్యూటీ కమిషనర్- 9154931446
ఇంజనీరింగ్ విభాగం
వెంకట శేషయ్య - ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్/ఇంచార్జి ఎస్ఈ - 9492067578
సునీత - డిప్యూటీ ఈఈ - 9985962290
అస్ర అష్రఫ్ - ఏఈఈ - 7337557239
వేణుగోపాల్ ఏఈఈ - 7331189502
రోహిత్ ఏఈఈ (హెచ్ డీ) - 7702 123424
టౌన్ ప్లానింగ్ విభాగం
సుధాకర్ - ఇంచార్జి అసిస్టెంట్ సిటీ ప్లానర్ 9346155567
టీపీబీఓ విశాల్రెడ్డి - 9391363999
రెవెన్యూ విభాగం
జయప్రకాశ్- అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ 9949347023
నిర్మల - ఇంచార్జి ఏఎంసీ 9398262057
మురళీధర్ సూపరింటెండెంట్- 8008090568
ఎలక్షన్ విభాగం
వి. రాఘవరెడ్డి - సూపరింటెండ్- 9948881230
హెల్త్ అండ్ శానిటేషన్
ఆశీష్ - ఏఈఈ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్- 812597 1396
యూసీడీ విభాగం
కరుణాకర్ డిప్యూటీ ప్రాజెక్టు ఆఫీసర్ (ఎస్ఏసీ) 9154167949
ఎలక్ట్రికల్ విభాగం
- ప్రసాద్ - ఎలక్ట్రికల్ ఏఈఈ - 9154909281
యూబీడీ విభాగం
అశోక్, అర్బన్ బయో డైవర్సిటీ మేనేజరు -
9704118520
ఎంటమాలజీ విభాగం
గంగప్ప - సీనియర్ ఎంటమాలజిస్ట్ - 9154831875
ఫుడ్ సేఫ్టీ విభాగం
డాక్టర్ సౌమ్య - ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ 7993354252
- రాజేంద్రనగర్, ప్రభాత ఉదయం



హైదర్ గూడలో ఓ హోటల్ లో తనిఖీ లు చేస్తున్న అధికారులు

## హైదర్‌గూడలోని రెండు హోటళ్లలో ఫుడ్ ఇన్స్పెక్టర్ తనిఖీలు

**రాజేంద్రనగర్, మార్చి 2(ప్రభాత ఉదయం)**

అత్తాపూర్ హైదర్ గూడ లోని రెండు హోటళ్లలలో సోమవారం అత్తాపూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ వి సమ్మయ్య, ఫుడ్ ఇన్స్పెక్టర్ సౌమ్య లు తనిఖీలు నిర్వహించారు. మొదటగా గోల్డెన్ ప్యాలెస్ హోటల్ లో, ఆ తర్వాత స్టార్ హోటళ్లలలో తనిఖీ లు నిర్వహించిన అధికారులు ఫుడ్ శాంపిల్స్ తీసుకుని ల్యాబ్ కు పంపించారు. ఈ హోటళ్లలలో నాణ్యత ప్రమాణాలు మెరుగుపరచాలని నోటీసులు ఇచ్చినట్లు డిప్యూటీ కమిషనర్ వి సమ్మయ్య తెలిపారు. హోటళ్లు, వివిధ రకాల తినుబండరాల దుకాణాలు, చికెన్, మాంసం దుకాణాలపై ఇక మీదట నిరంతర తనిఖీలు ఉంటాయని డిప్యూటీ కమిషనర్ వి సమ్మయ్య తెలిపారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రేటర్ ఉన్నతాధికారుల ఆదేశాలతో తనిఖీలు నిర్వహిస్తున్నామని, ఇది నిరంతర ప్రక్రియ అన్నారు. హోటళ్ల నిర్వాహకులు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. పరిశ్రుభమైన వాతావారణంలో హోటళ్ళు నిర్వహించాలన్నారు.

ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక

# వణుకు ఒత్తిడి లేకుండా చదవాలి






### ఆర్ బి వి ఆర్ చైర్మన్ వెంకట్ రెడ్డి రంగారెడ్డి

### ఘనంగా విలియం కొండ ఆర్ బి వి ఆర్ స్కూల్ 28వ వార్షికోత్సవం

**కొత్తకోట, మార్చి 2(ప్రభాత ఉదయం)**

విద్యార్థులు వణుకు ఒత్తిడి లేకుండా చదవాలని ఆర్ బి వి ఆర్ చైర్మన్ వెంకట్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. కొత్తకోట మండలంలోని విలియం కొండ గ్రామ సమీపంలో ఆదివారం రోజు రాత్రి జరిగిన రాజా బహదూర్ వెంకట్ రామ్ రెడ్డి మోడల్ హై స్కూల్ 28వ వార్షికోత్సవ సమావేశంలో ఆర్ బి వి ఆర్ ఆర్ చైర్మన్ వెంకట్ రంగారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ రోజుల్లో పరీక్ష అనే పదం వినగానే విద్యార్థుల గుండెల్లో వణుకు ఒత్తిడి ఆందోళనలోకి జారిపోతున్నారు. పిల్లలు ఒత్తిడి లేకుండా చదివితే జీవితంలో ఉన్నంత స్థాయికి చేరుకోవచ్చని చైర్మన్ అన్నారు. కన్వీనర్ గిరిధర్ రెడ్డి మాట్లాడుతూ ...గురువుల మార్గదర్శం తల్లిదండ్రుల ఆశీర్వాదం ఉంటే ఏ లక్ష్యానైనా చేరుకోవచ్చని అన్నారు. కమిటీ మెంబర్ ఎడమ మాధవరెడ్డి మాట్లాడుతూ ...మన దేశ భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉంది మీరు మంచి విద్యార్థులు గానే కాకుండా, మంచి మనుషులుగా, సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలని, నిజాయితీ, సేవా భావం, క్రమశిక్షణ ఇవే మీ విజయానికి మంత్రాలన్నారు. స్కూల్ ప్రిన్సిపాల్ హైమాదేవి మాట్లాడుతూ... ఈ వార్షికోత్సవ వేదిక సందర్భముగా సంవత్సరం అంతా సాధించిన విజయాలను చదువులలోనే కాకుండా క్రీడలు సంస్కృతిక కార్యక్రమాలు వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ కన్వీనర్ గిరిధర్ రెడ్డి , కమిటీ మెంబర్స్ గోపాల్ రెడ్డి, వెంకట్ రెడ్డి, సుకన్య, రఘువీరా రెడ్డి, వేముల శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్ సురేష్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.




## ఓపెన్ ఇన్విటేషనల్ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్‌షిప్‌లో శ్రీ శ్లోక ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

**పటాన్ చెరు, మార్చి 2 (ప్రభాత ఉదయం):**

కాటేదాన్ స్పోర్ట్స్ ఇంటర్నల్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఓపెన్ ఇన్విటేషనల్ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్‌షిప్‌లో బొల్లారం శ్రీ శ్లోక ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు పలు పతకాలు సాధించారు.అండర్-12 కటా విభాగంలో మితాంశి గోల్డ్ మెడల్ సాధించగా, జశ్విక సిల్వర్ మెడల్ గెలుచుకుంది. అలాగే అండర్-12 ఓపెన్ విభాగంలో అన్విత గ్రేస్ మరియు నినిశా రెడ్డి గోల్డ్ మెడల్స్ సాధించి పాఠశాలకు గౌరవం తీసుకొచ్చారు.ఈ సందర్భంగా విజేత విద్యార్థులను పాఠశాల యాజమాన్యం అభినందించింది. పాఠశాల చైర్మన్ కొత్వాల్ హరికృష్ణ రెడ్డి, అకడమిక్ డైరెక్టర్లు సింహాచలం, మహిపాల్ రెడ్డి, ప్రిన్సిపల్ హరిప్రియ, వైస్ ప్రిన్సిపల్ ప్రసాద్, ఆల్ ఇండియా గ్రాండ్ మాస్టర్ సాజిద్, టెక్నికల్ అడ్వైజర్ ఇసాముద్దీన్, చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ కోచ్ పి. సునీల్, శేఖర్ విద్యార్థులను అభినందించి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. పాఠశాల యాజమాన్యం క్రీడలకు ఎల్లప్పుడూ ప్రాధాన్యతనిస్తూ విద్యార్థుల సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నట్లు తెలిపారు.




## గడ్డపోతారం పారిశ్రామిక వాడలో కార్మికుల ర్యాలీ

### పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు భద్రత, ఆరోగ్య సంరక్షణ అవసరం

**పటాన్ చెరు, మార్చి 2 (ప్రభాత ఉదయం):**

కార్మికులకు భద్రత, ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అనే అంశంపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని పరిశ్రమల శాఖ అధికారి మోహన్ బాబు ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాలని పారిశ్రామిక ప్రాంతంలో భద్రతా ర్యాలీ నిర్వహించారు. కాంట్రాక్ట్ ఉద్యోగులు సహా సుమారు 250 మంది ఉద్యోగులు ఈ ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ ర్యాలీలో పరిశ్రమల్లో సురక్షితమైన, ఆరోగ్యకరమైన పనివాతావరణాన్ని ప్రోత్సహించాలని కోరుతూ ర్యాలీ చేపట్టారు.ఈ కార్యక్రమాన్ని పారిశ్రామిక ప్రాంతంలో నిర్వహించేందుకు విలువైన మార్గదర్శకాలు అందించిన డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ మోహన్ బాబుకి నిర్వాహకులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఈ కార్యక్రమానికి ప్రోత్సాహం, మద్దతు అందించిన డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నెహ్రూ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.అపిటోరియా ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్, మ్యాట్రిక్స్ ఫార్మాకార్ప్ (యూనిట్‌ఉ1 & 2), విరూపాక్ష ఆర్గానిక్స్, నీలాండ్. ఆర్డిపిఎల్ లీ ఫార్మా యాజమాన్య బృందాలకు వారి సహకారం మరియు కార్యాలయ భద్రత పట్ల ఉన్న నిబద్ధతకు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమం ముగింపులో, భద్రతా సంస్కృతిని మరింత బలోపేతం చేసి, కార్యాలయాల్లో శూన్య ప్రమాదాల లక్ష్యాన్ని సాధించేందుకు అందరం కలసి పనిచేయాలని పునరుద్ఘాటించారు.




## ఓపెన్ ఇన్విటేషనల్ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్‌షిప్‌లో శ్రీ శ్లోక ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

**పటాన్ చెరు, మార్చి 2 (ప్రభాత ఉదయం):**

కాటేదాన్ స్పోర్ట్స్ ఇంటర్నల్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఓపెన్ ఇన్విటేషనల్ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్‌షిప్‌లో బొల్లారం శ్రీ శ్లోక ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు పలు పతకాలు సాధించారు.అండర్-12 కటా విభాగంలో మితాంశి గోల్డ్ మెడల్ సాధించగా, జశ్విక సిల్వర్ మెడల్ గెలుచుకుంది. అలాగే అండర్-12 ఓపెన్ విభాగంలో అన్విత గ్రేస్ మరియు నినిశా రెడ్డి గోల్డ్ మెడల్స్ సాధించి పాఠశాలకు గౌరవం తీసుకొచ్చారు.ఈ సందర్భంగా విజేత విద్యార్థులను పాఠశాల యాజమాన్యం అభినందించింది. పాఠశాల చైర్మన్ కొత్వాల్ హరికృష్ణ రెడ్డి, అకడమిక్ డైరెక్టర్లు సింహాచలం, మహిపాల్ రెడ్డి, ప్రిన్సిపల్ హరిప్రియ, వైస్ ప్రిన్సిపల్ ప్రసాద్, ఆల్ ఇండియా గ్రాండ్ మాస్టర్ సాజిద్, టెక్నికల్ అడ్వైజర్ ఇసాముద్దీన్, చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ కోచ్ పి. సునీల్, శేఖర్ విద్యార్థులను అభినందించి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. పాఠశాల యాజమాన్యం క్రీడలకు ఎల్లప్పుడూ ప్రాధాన్యతనిస్తూ విద్యార్థుల సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నట్లు తెలిపారు.




గద్వాల జిల్లా డీసీసీ అధ్యక్షులు రాజీవ్ రెడ్డి కుటుంబ సభ్యులతో ఏఐసీసీ అధినేత రాహుల్ గాంధీ

## గద్వాల జిల్లా డిసిసి అధ్యక్షులు రాజీవ్ రెడ్డిని ప్రశంసించిన ఏఐసీసీ అధినేత రాహుల్ గాంధీ

**గద్వాల జిల్లా ప్రతినిధి, మార్చి 2(ప్రభాత ఉదయం)**

తెలంగాణ డీసీసీ అధ్యక్షుల శిక్షణా కార్యక్రమం ముగింపు వేడుకలో రాహుల్ గాంధీ పాల్గొన్నారు.జోగులాంబ గద్వాల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి రాహుల్ గాంధీతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాజీవ్ రెడ్డి కుటుంబంతో కలిసి రాహుల్ గాంధీ ఫోటోలు దిగారు. అనంతరం ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజన కార్యక్రమంలో కూడ ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాహుల్ గాంధీ కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ... రాజీవ్ రెడ్డి చేసిన కృషిని ప్రత్యేకంగా ప్రశంసించారు. కాంగ్రెస్ అంతర్గత ఎన్నికల సమయంలో తొలిసారి పరిచయం అయినప్పటి నుంచి రాజీవ్ రెడ్డి పార్టీకి నిబద్ధతతో పనిచేస్తూ, అప్పగించిన ప్రతి బాధ్యతను సమర్థంగా నిర్వహిస్తున్నారని గుర్తు చేశారు. సంవత్సరాలుగా కలిసి పనిచేసిన అనుబంధాన్ని స్మరించుకుంటూ, ఆయన కష్టపడి పనిచేసే నాయకుడని అభినందించారు.పార్టీకి రాజీవ్ రెడ్డి వంటి అంకితభావం కలిగిన నాయకులు అవసరమని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. భవిష్యత్తులో పార్టీ మరింత ఉన్నత శిఖరాలకు చేరుకోవడంలో ఇలాంటి నాయకుల పాత్ర కీలకమని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమం ద్వారా తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత బలోపేతానికి మరింత ఊతం లభించనుందని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.



## శివాలయ ప్రాంగణంలో గదులు నిర్మిస్తాం

### ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

**పటాన్ చెరు, మార్చి 2 (ప్రభాత ఉదయం):**

జిన్నారంలోని శివాలయ అభివృద్ధికి పూర్తి స్థాయిలో సహకారం అందిస్తానని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి తెలిపారు. జిన్నారం మున్సిపల్ వైస్ చైర్మెన్ ప్రతాప్ రెడ్డి, కౌన్సిలర్ స్వప్న రాజేందర్ రెడ్డి లతో సహా పలువురు గ్రామస్తులు ఎమ్మెల్యేను కలిశారు.గ్రామంలోని సర్వే నంబర్ ఒకటి సమస్యను అతి త్వరలో రైతులకు న్యాయం జరుగుతుందని తెలిపారు. శివాలయంపై పంతులు నివాస గదులు,స్వాముల దీక్షకు మండపం నిర్మాణం చేస్తానన్నారు. ఈ నెల5న జిన్నారంలో నూతనంగా నిర్మించిన పాఠశాల గదులను ప్రారంభిస్తామని వెల్లడించారు.పెద్దమ్మగూడెం పానాది రోడ్డుకు, పాఠశాల ప్రాంగణంలో మొరం పోయడానికి, వైస్ చైర్మెన్ ప్రతాప్ రెడ్డిని ఆదేశించారు.ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఆనంద్ చారి, గాండ్ల శ్రీనివాస్, టెంట్ శ్రీనివాస్, మహేందర్ గౌడ్,బాలుచారి,సందీప్ రెడ్డి,బుక్క శ్రీకాంత్,రాజు గౌడ్,అశోక్ చారి,జిన్నారం రాము, ఫోటో ప్రభాకర్,నీలం వెంకటేష్,రాము,ఫణి భూషణ్, వేణురెడ్డి,నీలం విక్కి, చంద్రా రెడ్డి,సాయి,పుట్టి మధు,కిషోర్ చారి తదితరులు ఉన్నారు.



## పరిశ్రమ ఆవరణలోనే పారిశ్రామిక వ్యర్థాల దహనం

### ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్థానికులు

**పటాన్ చెరు, మార్చి2 (ప్రభాత ఉదయం):**

తమ పరిశ్రమ ఆవరణలోనే పారిశ్రామిక వ్యర్థాలను దహనం చేస్తూ ఓ పరిశ్రమ బరితెగించి వ్యవహరించడం పట్ల స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.బొల్లారం ఎనిచ్ ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా ఓ పరిశ్రమ ఘన వ్యర్థాలు, ప్లాస్టిక్ ఘనవ్యర్థాలు దహనం చేస్తుండడంతో విచ్చలవిడిగా వాయు కాలుష్యం నెలకొంటుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక వివిఎస్ చైతన్య టెక్నాలజీస్ ఆక్సిజన్ ప్లాంట్ నిర్వాహకులు పరిశ్రమ ఆవరణలోనే వ్యర్థాలను, ప్లాస్టిక్ వ్యర్థాలను పెద్ద ఎత్తున దహనం చేయడం వల్ల పెద్ద ఎత్తున విష వాయువులు వెలువడి చుట్టుపక్కల నివాసాలు, పారిశ్రామిక ప్రాంతంలోకి వ్యాపిస్తున్నాయని స్థానికంగా ఆగ్రహం వ్యక్తం అవుతుంది. సామాన్య జనజీవనంతోపాటు పర్యావరణ విఘాతానికి పాల్పడుతున్న పరిశ్రమ నిర్వాకంపై తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.




వర్క్ షాప్ లో పాల్గొన్న అధికారులు, ట్రాన్స్ జెండర్ ల ప్రతినిధులు

## ట్రాన్స్ జెండర్ - వైవిధ్యభరితమైన కమ్యూనిటీలకు సమ్మిళిత, గౌరవ ప్రదమైన జీవనోపాధి అవకాశాలను కల్పించాలి

**బుద్వేల్, మార్చి 2 (ప్రభాత ఉదయం):**

ట్రాన్స జెండర్ - వైవిధ్యభరితమైన కమ్యూనిటీలకు సమ్మిళిత, గౌరవ ప్రదమైన జీవనోపాధి అవకాశాలను ముందుకు తీసుకురావడానికి కెనడా కట్టుబడి ఉందని, ఈ పథకం అమలులో రాజేంద్రనగర్ లోని జాతీయ గ్రామీణాభివృద్ధి పంచాయతీరాజ్ అభివృద్ధి సంస్థ (ఎన్ఐఆర్డీపీఆర్) సహకారం అందజేయడం సంతోషంగా ఉందని భారత ప్రభుత్వ కార్మిక, ఉపాధి మం త్రిత్వ శాక మాజీ కార్యదర్శి సుమితా దావ్రా అన్నారు. గ్రామీణ భారత దేశంలో ట్రాన్స్ జెండర్, లింగ వైవిధ్య సమాజాలకు స్థిరమైన వేతన ఆధారిత జీవనోపాధి అవకాశాలను మెరుగుపరచడంపై ఎన్ఐఆర్డీపీఆర్, కెనడా ఫండ్ పర్ లోకల్ ఇనిషియేటివ్స్ (సీఎఫ్ఎల్ఐ) లు సంయుక్తంగా సోమవారం రాజేంద్రనగర్ లో జాతీయ వర్క్‌షాప్ ను నిర్వహించింది. ట్రాన్స్ జెండర్ల విజయగాథలను తెలుసుకొని వారికి మెరుగైన జీవనోపాధులను కల్పించడం పై దృష్టి సారించాలన్నారు. ఈ సందర్భంగా ట్రాన్స్ - ఆప్టి అనే వెబ్ పోర్టల్ ను ఆవిష్కరించారు. కేంద్ర పదకాలను తెలుసుకుని ముందు కు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ సంస్థలతో పాటు యూనివర్శిటీ ఆఫ్ లా కమ్యూనిటీ ఆధారిత సంస్థల నాయకులు రవి శ్రీధరన్, ఎన్ఐఆర్డీపీఆర్ కు చెందిన జ్యోతీస్ సత్యపాలన్, డాక్టర్ పార్థ ప్రతీమ్ సాహు, డాక్టర్ సంధ్య గోపకుమారన్, అవినాబా దత్తా లు పాల్గొన్నారు.

# మైలార్‌దేవ్‌పల్లి హనుమాన్ కాలనీలో హోలీ సంబరాలు



**రాజేంద్రనగర్, మార్చి 2 (ప్రభాత ఉదయం)**

అత్తాపూర్ జిహెచ్ఎంసి సర్కిల్ పరిధిలోని మైలార్ దేవ్ పల్లి హనుమాన్ కాలనీ లో మహిళలు హోలీ సంబరాలు జరుపుకున్నారు. సోమవారం రాత్రి కాలనీలో కాముని దహనం నిర్వహించారు. ఈ హోలీ వేడుకల్లో గోదావరి ,పెంటమ్మ ,శిరీష, సునీత ,గీత ,మాధవి ,అక్షిత, చరిత, జ్యోతి ,రమ్య తదితరులు పాల్గొన్నారు

# ఏబిఎఫ్ఎంఎస్ పై నిరాధరమైన, తప్పుడు, అసత్య ప్రచారాలు మానుకోవాలి

## ఏబిఎఫ్ఎంఎస్ ప్రతినిదులు

**జనగామ జిల్లా ప్రతినిధి, మార్చి 02 (ప్రభాత ఉదయం):**


విలేకరుల సమావేశం లో మాట్లాడుతున్న ఎబిఎఫ్ఎంఎస్ ప్రతినిధులు

గత ఫిబ్రవరి 2న ప్రిస్టన్ స్కూల్ జనగామలో ఒక పత్రికా సమావేశం ఏర్పర్చి అందులో రెవ డాక్టర్ కె.యం.జాన్, దామెర జేమ్స్, బక్క ప్రవీన్ కుమార్ నిరాధరమైన, తప్పుడు, అసత్య ప్రచారాలు చేశారని, ఈ కేసు కోర్టులో ఉన్నదని దానిపై తప్పుడు ప్రచారాలు మానుకోవాలని ఏబిఎఫ్ఎంఎస్ ప్రతినిదులు నల్ల సుకుమార్, తాటికాయల ప్రవీణ్ కుమార్, నల్ల ఆమోసు, ఎం.రాజేష్, పి.విలియం, కోర్నెల్, ఆశీర్వాదం, ఇమ్మానుయేల్, అజయ్ తెలిపారు. సోమవారం జనగామలోని ఓ ఫంక్షన్ హాల్లో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనగామ ప్రెస్టన్ ఆస్తులు ప్రధానంగా సర్వే నెం 87, 88, 89 ప్రిస్టన్ భూములకు సంబందించి దామెర జేమ్స్ అనే వ్యక్తి నల్ల ఆమోస్, నల్ల సుకుమార్, నల్ల లాజర్, ఎల్మర్ అని పేర్లతో ఆరోపించడం జరిగిందన్నారు. ప్రధానముగా అమెరికన్ బాప్టిస్ట్ ఫారిన్ మిషన్ సొసైటీ (ఏబిఎఫ్ఎంఎస్) దొంగ జి.పి.ఏ. లతో చెలామణి అవుతున్నారని వేరే సంస్థతో కుమ్మక్కయ్యారని, డబ్బులు తీసుకున్నారని ఆరోపించడం (వి కండెంన్ బేస్లెస్ అల్లిగేషన్) పై మేము ఖండించడం జరుగుతుందన్నారు. అమెరికన్ బాప్టిస్ట్ ఫారిన్ మిషన్ సొసైటీ (ఏబిఎఫ్ఎంఎస్) ప్రతినిదులమైన మేము గత 18 సంవత్సరముల నుండి ఈ సంస్థ గురించి న్యాయపరంగా పోరాడుచున్నామన్నారు. ఈ సంస్థకు ఈ ప్రిస్టన్ భూముల పైన హక్కు ఉన్నదని పునరుద్ఘాటించి న్యాయ పోరాటం చేసి జాయింట్ కలెక్టర్ ఆర్డర్ ఇ5/4782/2009 ఆర్డర్ 2011 జనవరి 12న సంపాదించినాము, ఇట్టి జనగామ ప్రిస్టన్ ఆస్తులకు సంబంధించి ఏబిఎఫ్ఎంఎస్ అసలు మనగడలో లేదని అనుకునే సందర్భంలో 2009లో జాయింట్ కలెక్టర్ దగ్గర రివిజన్ ఫైల్ చేసి ఆర్డర్ సంపాదించినామని, తద్వారా ఏబిఎఫ్ఎంఎస్ యొక్క యాజమాన్య హక్కు చాలా సంవత్సరాల తరువాత పునరుద్దరింప బడిందని, వెలుగులోనికి వచ్చిందన్నారు. రెవరెండ్ డాక్టర్ కెఎం.జాన్ ఏబిఎఫ్ఎంఎస్ నుండి సేల్ జిపిఏ తెచ్చుకొనిన విషయం అక్షర సత్యమని దాని ఆధారాలు ఉన్నాయన్నారు. ఇంతే గాక మేము హన్మకొండలో ఉన్న ఏబిఎఫ్ఎంఎస్ ఆస్తుల విషయంలో కూడా పదమూడు సంవత్సరాలు పోరాటం చేసి ఏబిఎఫ్ఎంఎస్ పక్షమున జడ్జిమెంట్ డిక్రీ ని సంపాదించియున్నామన్నారు. ఇట్టి విషయం అందరికి తెలుసని ఇలా తదితర ప్రాంతాల్లో కూడా ఏబిఎఫ్ఎంఎస్ పక్షముగా, ఏబిఎఫ్ఎంఎస్ హక్కు, అధికారం చట్ట పరంగా, కోర్టు ద్వారా చేకూర్చబడేటట్లు నిరంతర, నిర్విరామ పోరాటం చేయచున్నామన్నారు. కోర్టు కేసుల్లో ఏబిఎఫ్ఎంఎస్ మేమే అయియున్నాము, ఏబిఎఫ్ఎంఎస్ యొక్క కష్ట నష్టాలు సహించి, భరించి పోరాటం చేయుచున్నామని, 18 సంవత్సరాల నుండి ఏబిఎఫ్ఎంఎస్ సంస్థ నిమిత్తం, ఆస్తుల నిమిత్తం, 2007 సంవత్సరం నుండి పోరాటం చేయుచున్నామ న్నారు. ఇప్పటికి మేము మీడియా ముందుకు రాలేదు, మా పోరాటం అంతా లీగల్ గా కోర్టుల్లో పోరాటం చేయడం జరిగిందన్నారు. మా పైన అసత్య అరోపణలు చేసిన వ్యక్తులు ఎవ్వరు..? వారి చట్ట పరమైన స్థితి ఏమై ఉన్నది. వాట్ ఇస్ ది లీగల్ స్టేటస్ అఫ్ దామెర జేమ్స్ వారు ఎస్టిబిసి ప్రతినిదిగా ఉన్నారా..? పిఏబిసి పతినిదిగా ఉన్నారా..? లేదా సామాన్య సంఘ ప్రతినిధిగా ఉన్నారా..? ఏబిఎఫ్ఎంఎస్ కు సంబంధం లేని వ్యక్తులు మరియు ఏబిఎఫ్ఎంఎస్ ను వ్యతిరేకం చేస్తున్న సంస్థలు ఎస్టిబిసి మరియు పిఏబిసి అక్రమ ప్రతినిదులు ఇట్టి నిరాధారమైన క్లేమ్ చేయుచున్నారని వివరించారు. ఏదైన చట్టపరమైన క్లేమ్ ఉన్నట్లయితే లీగల్ గా కోర్టుల్లో మేము వేసిన సూట్లలో నిరూపణ చేయాలి గాని నిరాధారమైన ఆరోపణ చెల్లదని, దామేర జేమ్స్ 25 ఫిబ్రవరి 2026 మాట్లాడిన అసత్య, నిరాధారమైన, పరువు నష్టం చేసే ఆరోపణలు చేయడం జరిగి యున్నదని, ఇట్టి విషయమై చట్టం తన పని తాను చేసుకుంటూ వెలుతోందన్నారు. వారు చేసిన ఆరోపణలు వెర్బటిమ్ మాట్లాడిన ఆరోపణ మాటలు ఏమనగా.. కొందరు ఏబిఎఫ్ఎంఎస్ దొంగ జిపిఏ తెచ్చుకొని ఆమోస్ నల్ల సుకుమార్, నల్ల లాజర్, ఎల్మర్ వీరు అందరు జగన్ మోహన్ రెడ్డితో కుమ్మక్కై ఆస్తిని కొల్లగొట్టారు, ఎల్మర్ వర్గం జగన్ మోహన్ రెడ్డి దగ్గర సుమారు 2 కోట్ల చిల్లర డబ్బులు తీసుకొని నో ఆబ్జెక్షన్ చెప్పారని, ఎక్కడ, ఏ కోర్టులో, ఎవ్వరు ప్రతినిదులుగా ఉన్నారని నిరాధారమైన ఆరోపణలు, అసత్య వాక్యలు, మీడియా సాధనం ద్వారా ప్రచారం చేయుచున్నారన్నారు. ఇట్టి దురుద్దేశంతో మోసపూరిత వాఖ్యలు మీడియా ద్వారా ప్రచారం చేయుచున్నారని, ఇట్టి దురుద్దేశ వాఖ్యలు సివిల్ మరియు క్రిమినల్ చర్యలకు దారి తీస్తుందన్నారు. ఈ విషయమై లీగల్ నోటీసు పంపియున్నామని మేము గౌరవ కోర్టులో ఏబిఎఫ్ఎంఎస్ ప్రతి నిధులముగా ప్రయాసపడి, న్యాయ పోరాటం చేసి ఇట్టి సంస్థకు హక్కు ఉన్నదని కోర్టులలో స్టేలు తీసుకువచ్చినప్పు డు దొరలము అటు తరువాత దొంగలం, ఇట్టి స్టేట్ మెంట్లో ఎంత సత్యం ఉన్నదో..? గమనించాలి. ప్రస్తుతం కూడా ఇట్టి ప్రిస్టన్ భూములకు సంబందించి ఎన్నో కేసులు నడుస్తున్నా యి. ఇట్టి కేసులలో కూడా ఏబిఎఫ్ఎంఎస్ యొక్క రైట్, ఇంట్రెస్ట్, ఓనర్షిప్ హక్కు అధికారం యాజమాన్యం గురించి పోరాటం చేయుచున్నా మన్నారు. ఇది గమనించిన దామెర జేమ్స తదితరులు అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి జనగామలో ఇట్టి సూట్ ఎస్టిబిసి ప్రతినిదిగా ఫైల్ చేసి కొనసాగించనందు వలనడిస్మిస్ కావడం జరిగిందన్నారు. సూట్ పిఏబిసి మరియు ఏబిఎఫ్ఎంఎస్ వ్యతిరేకముగా ఫైల్ చేయడం జరిగియున్నదన్నారు. అంతే కాకుండా కంటెంప్ట్ అప్లికేషన్ చెన్నై కోర్టు కేసు ఫైల్ చేయడం జరిగియున్నదన్నారు. ఓ.ఎస్.ఏ 69/1999 ఆర్డర్ డేటెడ్ 25-07-2000 ఉల్లంగించారని గానీ అట్టి కంటెంప్ట్ ను కొనసాగించకుండ ఉప సంహరించు కోవడం జరిగిందని, 2025 అక్టోబర్ 23న కోర్టు స్పష్టం చేయడం జరిగిందన్నారు. దామెర జేమ్స అనే వ్యక్తి గిఫ్ట్ డీడ్ ద్వారా ప్లాట్లు పొందుకొని సేల్ చేయడం జరిగి యున్నదని ఈ ప్రిస్టన్ ఆస్తి కాపాడాలనుకునే వ్యకి అమ్ముకున్నాక ఏమి నైతిక బాధ్యత ఉన్నదని ప్రశ్నించారు. డాక్యుమెంట్ నెం.428/2004 తేది 04-03-2004 సి.ఎస్.124/9194 తేదీ 19-12-2024 ఇట్టి జడ్జిమెంట్ గూర్చి తప్పుడు వాఖ్యానాలు చేయుచున్నారని, అట్టి తప్పుడు వాఖ్యనం కోర్టు దిక్కారముగా పరిగనింపబడుతుందన్నారు. మా పోరాటం ప్రెస్ కాన్ఫరెన్సతో కాదు గాని కోర్టుల్లో ఉన్నదని మేము 2009 సంవత్సరం నుండి 18 సంవత్సరములుగా పోరాడుచున్నామన్నారు. ఎవరికి హక్కు ఉన్నది ఎవరికి హక్కు లేదు అనేది కోర్టులు నిర్ణయిస్తాయని, మా సంస్థ పరంగా కోర్టుల్లో పునరుద్ధరించడంలో ఏబిఎఫ్ఎంఎస్ హక్కు, యాజమాన్యం మేము ముందు ఉన్నామని వివరించారు. పిఏబిసికి, ఎస్టిబిసి రూపంలో తెలుగు బాప్టిస్టు చర్చిల సమావేశం మరియు ఏబిఎఫ్ఎంఎస్ కు దాని మత పరమైన సేవా సంస్థ ఉన్నదని దాని పేరు తెలుగు బాప్టిస్టు చర్చి కౌన్సిల్ (టీబీసీసీ) రూపంలో ఉన్నదని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏబిఎఫ్ఎంఎస్ జనగామ ప్రతినిదులు, టీబీసీసీ జనగామ ప్రతినిదులు సత్యపాల్, జీవరత్నం, ప్రభాకర్, గుగ్గిళ్ల సుధాకర్, డేవిడ్, జాస్లిన్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీపాదరావు కు నివాళి అర్పిస్తున్న జిల్లా కలెక్టర్, ఇతర అధికారులు

## ఘనంగా దివంగత శాసనసభ స్పీకర్ శ్రీపాదరావు జయంతి

**చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించిన జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**జనగామ జిల్లా ప్రతినిధి, మార్చి 02(ప్రభాత ఉదయం)**

దివంగత శాసనసభ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి సందర్భంగా సోమవారం కలెక్టరేట్ లో ఘనంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్, వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.


పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్

## ఇంటర్మీడియట్ పరీక్షల కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**జనగామ జిల్లా ప్రతినిధి, మార్చి 02(ప్రభాత ఉదయం)**

ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణలో భాగంగా జనగామ పట్టణంలోని ఏబివి ప్రయివేట్, ప్రభుత్వ జూనియర్ కాలేజీ లని సోమవారం జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకస్మికంగా సందర్శించారు.పరీక్షా కేంద్రంలో ఏర్పాట్లను, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, హాజరు వివరాలు, సీసీ కెమెరాల పనితీరు, తాగునీరు, వైద్య సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు.పరీక్షలు ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అంతరాయం లేకుండా నిర్వహించాలని సూచించారు. అలాగే నిబంధనలు కచ్చితంగా పాటించాలని, విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కళాశాల నిర్వాహకులకు ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లపై కూడా ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు.


ఊడ్గుల కిష్టయ్య ను సన్మానం చేస్తున్న సాయిలు

## మున్సిపల్ కౌన్సిలర్ ఊడ్గుల కిష్టయ్యకు సన్మానం

**పేద ప్రజల పక్షాన కౌన్సిల్ లో కొట్లాడాలి...**

**బిఆర్ఎస్ సీనియర్ నాయకులు జేరిపోతుల సాయిలు**

**జనగామ జిల్లా ప్రతినిధి, మార్చి 02(ప్రభాత ఉదయం)**

ఇటీవల జరిగిన జనగామ మున్సిపాలిటీ ఎన్నికలలో బిఆర్ఎస్ పార్టీ నుండి 17 వ వార్డు కౌన్సిలర్ గా గెలుపొందిన ఊడ్గుల కిష్టయ్య ను తన స్వగృహం లో సోమవారం బిఆర్ఎస్ సీనియర్ నాయకులు జేరిపోతుల సాయిలు శాలువా తో ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా జేరిపోతుల సాయిలు మాట్లాడుతూ వార్డు ప్రజల కు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సంక్షేమ కోసం పాటుపడాలని కోరారు. పేద ప్రజల పక్షాన నిలబడి రాష్ట్ర ప్రభుత్వం నుండి వచ్చే సంక్షేమ పథకాలు అందరికి అందేవిదంగా కౌన్సిల్ లో కొట్లాడి తన వాణి బలంగా వినిపించాలని చెప్పారు. ఈ కార్యక్రమం లో జనగామ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోట్ల నర్సింగరావు, న్యాయవాది, జర్నలిస్ట్ జేరిపోతుల ఉపేందర్, బిఆర్ఎస్ యువ నాయకులు భాషిపాక అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## ఆటోలో పోగొట్టుకున్న వస్తువులను తిరిగి ఇస్తున్న జనగామ క్రైమ్ పోలీసులు

**జనగామ జిల్లా ప్రతినిధి, మార్చి 02 (ప్రభాత ఉదయం)**


పోగుట్టుకున్న వస్తువులను ఇస్తున్న క్రైమ్ పోలీస్ లు

జనగామ జిల్లా కేంద్రంలో గల పాల కేంద్రం వద్ద సోమవారం మధ్యాహ్నం 12:30 గంటల సమయాన చేర్యాల మండలం ముస్త్యాల గ్రామం బేడబుడుగ జంగాల సామజిక వర్గానికి చెందిన వానరాసి స్పందన భర్త పరుశ రాములు అనే మహిళా ఎలక్ట్రికల్ ఆటో ఎక్కి బతుకమ్మ కుంట దగ్గర దిగిందని, ఆటోలో 5వేల రూపాయల నగదు, 50 వేల రూపాయల విలువ చేసే ఒప్పో 27 ప్రోమో సెల్ ఫోన్, పావు లెత్తు బంగారు కమ్మలు గల హ్యాండ్ బ్యాగ్ మరిచిపోయింది. జనగామ చౌరస్తాలోని పోలీస్ కంట్రోల్ రూం వద్దకు వచ్చి ఏడ్చు కుంటూ క్రైమ్ పోలీసులకు విషయాన్ని చెప్పగా జనగామ సీఐ సత్య నారాయణ రెడ్డి ఆదేశాల మేరకూ క్రైమ్ పోలీసులు తక్షణమే స్పందించి లోకేషన్ ట్రేస్ చేసి, ఆటోను వెతికి పట్టుకొని, ఆ మహిళకు సెల్ ఫోన్, 5వేల రూపాయల నగదు, పావులెత్తు కమ్మలు గల హ్యాండ్ బ్యాగ్ అప్ప గించారు. సీఐ సత్య నారాయణ రెడ్డి, క్రైమ్ ఎస్ఐ భరత్, ఎస్ఐ రతీష్, క్రైమ్ కానిస్టేబుల్స్ కర్ణాకర్ , కృష్ణ, ఐటీ కోర్ ఏఏఓ సల్మాన్ లకు సదరు మహిళా కృతజ్ఞతలు తెలిపారు.



## క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మార్ 2(ప్రభాత ఉదయం)**

తెలంగాణ రాష్ట్ర క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు రంగారెడ్డి కలెక్టర్ సి నారాయణ రెడ్డి తెలిపారు.తెలంగాణ ప్రభుత్వ క్రీడా పాఠశాలలు (హక్కీపేట్ ఉ కరీంనగర్, ఆదిలాబాద్, హనుమకొండ) లో 2026ఉ27 విద్యా సంవత్సరానికి గాను నాలుగో తరగతి ప్రవేశాల కోసం విద్యార్థినీ విద్యార్థుల ఎంపికలను మూడు దశల్లో నిర్వహిస్తున్నామన్నారు.

**ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్**

విద్యార్థినీ విద్యార్థులు తమ మొబైల్ ఫోన్ ద్వారా లేదా కంప్యూటర్ ద్వారా తేదీలు 26.02.2026 నుండి 04.03.2026 వరకు tgss□telangana□gov□in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చును. మండల స్థాయి ఎంపికలు , ఇతర వివరాల కోసం సంబంధిత మండల విద్యాధికారిని సంప్రదించవలెను.ఎంపిక ప్రక్రియమండల స్థాయి

తేదీలు: 13.03.2026 నుండి 17.03.2026 వరకు మండల విద్యాధికారి ఆధ్వర్యంలో ఎంపికలు నిర్వహించబడును ఎంపిక తేదీల వివరాలకు సంబంధిత మండల విద్యాధికారిని సంప్రదించాలన్నారు.మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులు మాత్రమే జిల్లా స్థాయికి అర్హులు

జిల్లా స్థాయి
తేదీలు: 28.03.2026 నుండి 01.04.2026 వరకు
స్థలం: సరోజ్‌నగర్ ఇండోర్ స్టేడియం, ఎల్.బి. నగర్
మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులు తప్పనిసరిగా పాల్గొనవలెను

రాష్ట్ర స్థాయి
తేదీలు: 27.04.2026 నుండి 01.05.2026 వరకు
జిల్లా స్థాయిలో ఎంపికైన విద్యార్థులనే రాష్ట్ర స్థాయి ఎంపికలకు పంపబడును

అర్హతలు (నాలుగో తరగతి కొరకు)
వయస్సు: 8 నుండి 9 సంవత్సరాల మధ్య ఉండాలి
జనన తేది: 01.09.2017 నుండి 31.08.2018 మధ్య జన్మించి ఉండాలి

అవసరమైన ధృవపత్రాలు
జనన ధృవీకరణ పత్రం ఆధార్ కార్డు,కుల ధృవీకరణ పత్రం ప్రోగ్రెస్ కార్డు / స్కూల్ బోనాఫైడ్ పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు

నిర్వహించు పరీక్షలు
ఎత్తు, బరువు కొలత 30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్
స్టాండింగ్ బ్రాడ్ జంప్ 800 మీటర్ల రన్
6ఐ10 మీటర్ల షటిల్ రన్ మెడిసిన్ బాల్ త్రో
వర్టికల్ జంప్ ఫ్లెక్సిబిలిటీ టెస్ట్

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, ఐ.ఏ.ఎస్., చేతుల మీదుగా, ఎస్. స్వర్ణలత, జిల్లా యువజన , క్రీడల అధికారి, రంగారెడ్డి జిల్లా గారితో కలిసి, ఇతర జిల్లా అధికారుల సమక్షంలో, కొంగరకలాన్ లోని సమగ్ర కలెక్టరేట్ కార్యాలయంలో స్పోర్ట్స్ స్కూల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.జిల్లా యువజన , క్రీడల అధికారి ఎస్ స్వర్ణలత పాల్గొన్నారు.



కుటుంబ సమేతంగా రాహుల్ గాంధీ ని కలిసిన ధన్వంతి లక్ష్మీనారాయణ

## రాహుల్ గాంధీని దేశ ప్రధానిగా చూడటమే తన లక్ష్యం

**డీసీసీ అధ్యక్షురాలు ధన్వంతి లక్ష్మీనారాయణ నాయక్**

**కుటుంబ సమేతంగా రాహుల్ గాంధీ ని కలిసిన ధన్వంతి లక్ష్మీనారాయణ నాయక్**

**జనగామ జిల్లా ప్రతినిధి, మార్చి 02(ప్రభాత ఉదయం)**

వికారాబాద్‌లో నిర్వహించిన డీసీసీ అధ్యక్షుల శిక్షణ శిబిరంలో భారత జాతీయ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పాల్గొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల డీసీసీ అధ్యక్షులు పాల్గొని పార్టీ బలోపేతంపై విస్తృతంగా చర్చించారు.సమావేశం అనంతరం రాహుల్ గాంధీ జనగామ డీసీసీ అధ్యక్షురాలు ధన్వంతి లక్ష్మీ నారాయణ లకావత్ తో ప్రత్యేకంగా మాట్లాడారు. జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేయాలని, అన్ని వర్గాల నాయకులు, కార్యకర్తలను కలుపుకొని ఏకతాటిపైకి తీసుకువచ్చి క్షేత్ర స్థాయిలో చురుకుగా పనిచేయాలని సూచించారు. రాబోయే ప్రతి ఎన్నికల్లో డీసీసీ అధ్యక్షులకు అవసరమైన అన్ని రకాల అధికారాలు కల్పించబడినట్లు తెలిపారు.ఈ సందర్భంగా ధన్వంతి లక్ష్మీ నారాయణ లకావత్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ ని కలవడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేస్తానని, ఆయనను దేశ ప్రధానిగా చూడటమే తన లక్ష్యమని పేర్కొన్నారు. జనగామ జిల్లాలో ప్రతి ఒక్కరికి, ప్రతి గ్రామానికి ప్రభుత్వ పథకాలు చేరేలా, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు అందేలా అన్ని వర్గాల ప్రజలను సమన్వయం చేస్తూ జిల్లాలో డీసీసీ కమిటీ, బ్లాక్, మండల, పట్టణ అధ్యక్షులు, పార్టీ అనుబంధ సంఘాల పనితీరును మరింత మెరుగుపరుస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఇంచార్జి మీనాక్షి నటరాజన్ శిక్షణలో పాల్గొన్న డీసీసీ అధ్యక్షులకు సర్టిఫికెట్‌లు జారీ చేసి, జనగామ జిల్లా డీసీసీ అధ్యక్షురాలు ధన్వంతి లక్ష్మీ నారాయణ లకావత్ ని ప్రత్యేకంగా అభినందించారు. జిల్లాలో జరిగే పార్టీ బలోపేత కార్యక్రమాలకు తన పూర్తి సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈ సందర్భంగా రాహుల్ గాంధీ టీపీసీసీ సభ్యులు డాక్టర్ లక్ష్మీనారాయణ నాయక్ తో మరియు వారి కుటుంసభ్యులతో కాసేపు మాట్లాడారు .ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు, కేసీ వేణుగోపాల్, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు, డీసీసీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

**జనగామ జిల్లా ప్రజలకు హోళీ పండుగ శుభాకాంక్షలు తెలిపిన డీసీసీ అధ్యక్షురాలు ధన్వంతి లక్ష్మీ నారాయణ లకావత్**

ఈ రంగుల పండుగ మీ అందరి జీవితాల్లో ఆనందం, ఐక్యత, సుఖశాంతులు నింపాలని ఆకాంక్షిస్తున్నాము. ప్రతి కుటుంబం ఆరోగ్యంగా, సంతోషంగా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాము. హోలీ పండుగను సహజసిద్ధమైన రంగులతో జరుపుకుని, పర్యావరణాన్ని కాపాడుతూ ఆనందంగా వేడుకలు నిర్వహించు కోవాలన్నారు. జిల్లా ప్రజలందరికి హృదయపూర్వక హోలీ శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రజావాణికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను పరిష్కరించాలి

## కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్


**గద్వాల జిల్లా ప్రతినిధి, మార్చి 2(ప్రభాత ఉదయం)**



ప్రజావాణి కార్యక్రమానికి ప్రతి అధికారి ప్రాధాన్యతనిస్తూ తమ శాఖల పరిధిలో వచ్చిన ఫిర్యాదులను నిర్దేశిత సమయంలోగా పరిష్కరించాలని గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు.సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 71 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు, అదనపు కలెక్టర్ నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావులకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ప్రజావాణి అనంతరం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులతో మాట్లాడుతూ... ప్రతి సోమవారం ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1:00 గంటల వరకు ప్రజావాణి నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఫిర్యాదుదారుల నుంచి వచ్చిన ప్రతి దరఖాస్తును ఆన్ లైన్ లో నమోదు చేసి వారంలోగా పరిష్కరించాలన్నారు. పరిష్కారం కాని దరఖాస్తులకు తగిన కారణాలు పేర్కొంటూ నిబంధనల ప్రకారం తిరస్కరించాలన్నారు. ప్రజావాణికి వచ్చే ఫిర్యాదుదారులకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలని అధికారులకు సూచించారు. వికలాంగులు వయోవృద్ధులకు వీల్ చైర్స్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రజావాణిలో తమ అర్జీలను ఇచ్చేందుకు వచ్చే ప్రతి ఒక్కరికి వరుస క్రమంలో టోకెన్లు జారీ చేయనున్నట్లు చెప్పారు. ప్రజావాణిలో తమ ఫిర్యాదులను తెలియజేసే ఆయా మండలాల ప్రజలకు జవాబుదారీగా ఉండేందుకు సంబంధిత ఎమ్మార్వోలు, ఎంపీడీవోలను కూడా భాగస్వాములను చేస్తూ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి అప్పటికప్పుడు ఆయా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ఎక్కువగా దరఖాస్తులు వస్తున్నందున ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రజావాణికి వచ్చే చాలామంది ప్రజలు తమ సమస్యలను ఎవరికి చెప్పాలో తెలియక అయోమయంలో ఉంటున్నారని, వారికి సహకారం అందించేందుకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి ఒక అధికారిని నియమించనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# నేడు చిలుకూరు బాలాజీ ఆలయం మూసివేత

**రంగారెడ్డి జిల్లా,మార్చి (ప్రభాత ఉదయం)**



చంద్రగ్రహణం నేపథ్యంలో మంగళవారం చిలుకూరు బాలాజీ ఆలయం మూసి వేస్తారని చిలుకూరు బాలాజీ ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఉదయం ఆరు గంటల నుంచి 7:30 గంటల వరకు స్వామివారి సేవలు నిర్వహించిన అనంతరం ఆలయం మూసివేస్తారని సూచించారు. సాయంత్రం ఏడు గంటలకు ఆలయాన్ని సంప్రోక్షణ చేస్తారని,కానీ భక్తులకు స్వామి వారి దర్శనం ఉండదని పేర్కొన్నారు.తిరిగి బుధవారం ఉదయం 6 గంటల నుంచి స్వామి వారిని దర్శనం చేసుకోవడానికి అవకాశం ఉంటుందని వారు తెలిపారు.




# రిటైర్డ్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి: ఎంపీలు

## డీకే అరుణ,రఘునందన్ రావు,ఈటెల రాజేందర్‌లు

**రాజేంద్రనగర్,మార్చి02 (ప్రభాత ఉదయం)**

భారతీయ జనతా పార్టీ రాష్ట్రశాఖ ఆధ్వర్యంలో రిటైర్డ్ ఎంప్లాయిస్ కోసం ధర్మ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని ముఖ్యఅతిథిగా కాటేపల్లి వెంకటరమణారెడ్డి పార్లమెంట్ సభ్యులు డీకే అరుణ,రఘునందన్ రావు,ఈటెల రాజేందర్,ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి,ఇతర ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.గత నెలలో అసెంబ్లీలో కాటుపల్లి వెంకటరమణారెడ్డి అసెంబ్లీ సాక్షిగా రిటైర్డ్ ఎంప్లాయిస్ కు వారి నిధులు పెన్షన్స్ కానీ ఇతరత్రా ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని,జిఐఎస్,టిఎస్ జిఎల్ఐ టపాకాయలను వెంటనే చెల్లించాలని అన్నారు.ఈ కుబేర్ లో ఉన్న పెన్షనర్ల బకాయిలను వడ్డీతో సహా సపరేట్గా చెల్లించాలని గ్రూప్ ఇన్సూరెన్స్ డబ్బులను వెంటనే చెల్లించాలని,ఏరియర్స్ పీఆర్సీ 2020 బకాయిలను వెంటనే చెల్లించాలని రిటైర్డ్ ఉద్యోగులకు చెల్లించాల్సిన గ్రాడ్యుయేట్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ధర్నా కార్యక్రమం నిర్వహించారు.ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించారు.

# జలమండలిలో కాగిత రహిత కార్యకలాపాలు

## ఈ- ఆఫీస్ ప్రారంభించిన ఎండీ అశోక్ రెడ్డి

**హైదరాబాద్, మార్చి 2 (ప్రభాత ఉదయం)**



జలమండలి అన్ని కార్యాలయాల్లో ఈ-ఆఫీస్ వ్యవస్థను పూర్తిగా అమలు చేయాలని ఎండీ అశోక్ రెడ్డి తెలియజేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ-ఆఫీస్ ను అన్ని విభాగాలలో అమలు చేస్తున్నట్లు.. దీనివల్ల కార్యాలయాల్లో సామర్థ్యం, పారదర్శకత, బాధ్యతతో పాటు సేవల ప్రమాణాలు మెరుగుపడనున్నాయని అయన అన్నారు.సోమవారం జలమండలి ప్రధాన కార్యాలయంలో జేఎండీ మయాంక్ మిట్టల్ తో కలిసి ఈ-ఆఫీస్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ.. ఈ-ఆఫీస్ విధానం ద్వారా ఫైళ్ల సత్వర పరిష్కారం సాధ్యమవుతుందని, అలాగే పరిపాలనలో జవాబుదారీతనం పెరుగుతుందని పేర్కొన్నారు. ఇక నుంచి ప్రతి ఫైలు మాన్యువల్ గా స్వీకరించడం జరగదని ఈ-ఆఫీస్ ద్వారా పంపించాలని అధికారులతో అన్నారు.ఈ-ఆఫీసులో స్కాన్ చేసి భద్రపరచడమే కాకుండా వివిధ విభాగాలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ఈ ఆఫీసులో పొందుపరచడం జరుగుతుందని, సంబంధించిన అధికారి ఎవరైనా వారి విభాగపు ఫైల్స్ ఈ-ఆఫీసులో సరిచూసుకునే వెసులుబాటు ఉండడంతో పరిపాలన సులభతరం అవుతుందని అన్నారు. తొలుతగా ప్రధాన కార్యాలయంలో అన్ని కార్యకలాపాలను ఈ-ఆఫీస్ లో నిర్వహిస్తామని.. విడతల వారీగా అన్నీ డివిజన్ లలో ఈ విధానాన్ని అమలు చేస్తామని ఎండీ వివరించారు.

**ఈ-ఆఫీస్ అమలు ముఖ్య ఉద్దేశాలు**

ఫైల్ చలనం.. వ్యవస్థ డిజిటలైజేషన్:

సాంప్రదాయ మాన్యువల్ ఫైల్ చలనం విధానాన్ని పూర్తిగా డిజిటల్ గా నిర్వహిస్తారు. అన్ని ఫైళ్లు ఈ-ఆఫీస్ ప్లాట్‌ఫామ్ ద్వారా ఎలక్ట్రానిక్ రూపంలో సృష్టించబడుతూ, ప్రాసెస్ చేయబడి, పంపబడుతూ, భద్రపరచబడతాయి. దీంతో భౌతిక ఫైళ్లపై ఆధారపడాల్సిన అవసరం ఉండదు.

2. పేపర్ వినియోగం తగ్గింపు:

డిజిటల్ డాక్యుమెంటేషన్, ఈ-నోటింగ్ మరియు డిజిటల్ అనుమతుల ద్వారా పేపర్ వినియోగాన్ని గణనీయంగా తగ్గించడమే లక్ష్యం. ఇది పర్యావరణ పరిరక్షణకు తోడ్పడటమే కాకుండా వ్యయ నియంత్రణకు దోహదపడుతుంది.

3. వేగవంతమైన అనుమతులు.. నిర్ణయాలు:

ఎలక్ట్రానిక్ ఫైల్ రూటింగ్, ఆటోమేటెడ్ వర్క్‌ఫ్లో ద్వారా ఫైళ్లు ఆలస్యం లేకుండా వేగంగా ప్రాసెస్ చేయబడతాయి. అధికారులు తమ కార్యాలయ వ్యవస్థల ద్వారా ఫైళ్లను సమీక్షించి, ఆమోదం ఇవ్వగలరు. దీంతో నిర్ణయాల ప్రక్రియ వేగవంతమవుతుంది.

4. ఫైళ్ల రియల్-టైమ్ ట్రాకింగ్:

ప్రతి దశలో ఫైళ్ల స్థితిని రియల్-టైమ్‌లో పర్యవేక్షించవచ్చు. ఫైల్ ఎక్కడ పెండింగ్‌లో ఉందో, ఎవరితో ఉందో, ఎంత కాలంగా ఉందో స్పష్టంగా తెలుసుకోవచ్చు. దీని ద్వారా ఆలస్యాలు తగ్గుతాయి.

5. పారదర్శకత, ఆడిట్ సౌలభ్యం:

కొత్త ఫైల్ సృష్టి, నోటింగ్, ఫార్వార్డింగ్, ఆమోదం లేదా మార్పులు వంటి ప్రతి చర్య డిజిటల్ టైమ్‌స్టాంప్, వినియోగదారుడి వివరాలతో రికార్డు చేయబడుతుంది. ఇది పూర్తి ఆడిట్ ట్రైల్‌ను నిర్ధారించి బాధ్యతాయుత పరిపాలనకు దోహదం చేస్తుంది.

6. కార్యాలయ విధానాల ప్రమాణీకరణ:

ఈ-ఆఫీస్ ప్లాట్‌ఫామ్ ద్వారా అన్ని విభాగాల్లో ఒకే విధమైన ప్రమాణిత విధానాలు అమలవుతాయి. ఫైల్ నిర్వహణలో ఏకరీతి విధానం పాటించవచ్చు.

విభాగానికి లభించే ముఖ్య ప్రయోజనాలు:

కార్యనిర్వహణ సామర్థ్యం పెరుగుతుంది.

ఫైళ్ల ప్రాసెసింగ్ సమయం తగ్గుతుంది.

రికార్డు నిర్వహణ మెరుగుపడుతుంది.

భద్రమైన డిజిటల్ నిల్వతో పాటు ఆవరమైనప్పుడు సులభంగా తనిఖీ చేసుకునే అవకాశం. విభాగాల మధ్య సమన్వయం మెరుగుపడుతుంది.ఈ-ఆఫీస్ వ్యవస్థ అమలు పారదర్శక,సమర్థవంతమైన, సాంకేతిక ఆధారిత పరిపాలన పట్ల కట్టుబాటుకు నిదర్శనం.ఈ కార్యక్రమంలో పర్సనల్ డైరెక్టర్ మహమ్మద్ అబ్దుల్ ఖాదర్, రెవెన్యూ సీజీఎం కిరణ్ కుమార్ లతో పాటు రెవిన్యూ, ఐటీ విభాగపు అధికారులు పాల్గొన్నారు.



# సమస్యల వలయంలో గంజిపేట

## గంజిపేట సమస్యలు పరిష్కరించాలి

**గద్వాల, మార్చి 2(ప్రభాత ఉదయం)**


తక్షణమే కాలనీలో నెలకొన్న ప్రధాన సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ చైర్మన్ మున్సిపల్ కమిషనర్ ని బీఅర్ఎస్ పార్టీ నాయకులు, గంజిపేట14 వార్డు కంటెస్టెడ్ కౌన్సిలర్ రాజు కోరారు .గద్వాల పట్టణంలోని గంజిపేట 14వార్డు లో బీఅర్ఎస్ నాయకులు, 14వ వార్డు కాంటెస్టెడ్ కౌన్సలర్ ౹ణాఖ రాజు పర్యటించారు. వార్డులో సరైన సీసీ రోడ్లు లేకపోవడం,డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటం వల్ల దుర్గంధ వెదజల్లుతోందని,బాత్ రూంలు కూడ లేక అరుబయటకు వెళ్ళాల్సిన దుస్థితి,అలాగే ప్రమాదకరంగా విద్యుత్ బోర్డుల ఏర్పాటు,కనెక్షన్ లు సరిగ్గా లేకపోవడం వంటి సమస్యలు నెలకొన్నాయి.వార్డులో ప్రధాన సమస్యలు అయిన తాగునీటి సమస్య,వీధి లైట్ల మరమ్మతులు,పారిశుధ్యం,డ్రైనేజీ సమస్యలతో పాటు చాలామంది అర్హులైన వారికి ఇప్పటికి పెన్షన్లు రాలేదని మరి కొందరికి ఉచిత విద్యుత్(గృహలక్ష్మి)పై అవగాహన లోపంతో దరఖాస్తు చేసుకోలేదు ఇలా వార్డులో అనేక సమస్యలు ఉన్నాయని ప్రజలు కంటెస్టెడ్ కౌన్సిలర్ రాజు తో విన్నవించారు.గంజిపేట కాలనీలో పారిశుధ్యం ఎప్పటికప్పుడు మెరుగుపరిచేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని మున్సిపల్ ఛైర్మన్ , కమిషనర్ కి పిడిఎస్యు రాజు ఫోన్ చేసి మాట్లాడారు.ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి మంజూరు చేయాలన్నారు.వార్డుల్లో చెత్త తరలింపు ప్రక్రియ రెగ్యులర్‌గా జరగాలని,ఎక్కడా వ్యర్థాలు పేరుకుపోకుండా చూడాలన్నారు. ప్రజలుసీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పారిశుధ్య ఇన్‌స్పెక్టర్లు నిరంతరం వార్డులను తనిఖీ చేయాలని మున్సిపల్ చైర్మన్, మున్సిపల్ కమిషనర్ ను కోరారు.



# నూతన వధూవరులను రాజశేఖర్, అక్షితలను ఆశీర్వదించిన నాయకులు

**కొత్తకోట, మార్చి 2 ( ప్రభాత ఉదయం)**

కొత్తకోట మండలంలోనిరామకృష్ణ పురం గ్రామానికి చెందిన యం లలిత నరసింహులు దంపతుల ద్వితీయ కుమారుడు రాజా శేఖర్ , బెంగుళూరు కు వాసి అలక (పద్మ) కీ "సే" శ్రీనివాస్ ల పుత్రిక అక్షత తో చంగి చర్ల క్రాస్ రోడ్డు హోటల్ టు లిప్పుగ్రాండ్ లొ రిసెప్షన్ జరిగింది. ఈ వివాహ రిసెప్షన్ వేడుకలు వనపర్తి జిల్లా సీనియర్ నాయకులు మూలమళ్ళ భీమ్ రెడ్డి , గోనూరు రామ కృష్ణయ్య , ఎం నరసింహులు, ఏం వెంకటయ్య, రవి , నాగరాజు, రాజశేఖర్ , చంద్ర శేఖర్ , కిరణ్, నవీన్ ,బంధు మిత్రులు నూతన వధూవరులను ఆశీర్వదించారు.




# ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం

**గద్వాల జిల్లా ప్రతినిధి, మార్చి 2(ప్రభాత ఉదయం)**

ధరూర్ మండలం అల్వాల్ పాడు మండల పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులు సోమవాదం స్వ పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా విద్యార్థులు ఆయా ఉపాధ్యాయ బాధ్యతలను నిర్వహించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. జిల్లా కలెక్టర్ గా మనోజ్, డీఈఓ గా నక్షత్ర, ఎంఈఓగా అరవింద్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులుగా స్నేహా, పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా చందూ బాధ్యతలు నిర్వహించారు. భవాని, శృతి, మేఘన, రంజని, శైలజ, ఐశ్వర్య, మురళి,శ్రీకర్, శ్రీనివాసులు, లోకేష్ చారి, నరేష్, మేఘన, పారిజాత, వంశీ, కృష్ణవేణి, షఫీ తదితరులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తరగతులను సమర్థవంతంగా బోధించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నీలావతి , ఉపాధ్యాయులు శివకుమారి, శైలజ, ఆంజనేయులు, షబానా, శివకుమార్, విద్యావతి, సైదన్న, నరసింహులు తదితరులు సమన్వయం చేసి విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు.విద్యార్థులు క్రమశిక్షణతో, ఆత్మవిశ్వాసంతో తమ తమ బాధ్యతలను నిర్వర్తించి అందరి ప్రశంసలు అందుకున్నారు. పాఠశాల నిర్వహణ బాధ్యతలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నీలావతి బహుమతులు అందజేశారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608